



epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

సంపుటి : 19 సంచిక : 25 | 04-04-2026 శనివారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 12 వెల : రూ.1.00




## సాండ్ మాఫియా చేతుల్లోకి ఇసుక ఆదాయం

తెలంగాణ రాష్ట్రంలో ఇసుక తవ్వకాల ఆదాయంపై కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేస్తున్న గణాంకాలు పూర్తిగా తప్పుదోవ పట్టించే విధంగా ఉన్నాయని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో ఇసుక తవ్వ కాల ద్వారా వచ్చిన ఆదాయం కేవలం 39 కోట్లే అని తెలిపారు. కానీ కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ ఎస్ ప్రభుత్వం తీసుకున్న సంస్కరణలతో ఇసుక ఆదాయం గణనీయంగా పెరిగిందని అన్నారు.

వార్త 2లో



## కల్తీ మామిడి పండ్లతో జాగ్రత్త

### కార్బైడ్ మామిడి పల్లను గుర్తించండి: సజ్జన్నార్

మామిడిపండ్ల సీజన్ ప్రారంభం అయ్యింది. నగరంలో నోరూరించే పళ్లు కనిపిస్తున్నారు. ఇదే అదనుగా కొందరు వ్యక్తులు కల్తీ మామిడి విక్రయాలకు పాల్పడటం ఆందోళనకు గురిచేసే విషయం. మామిడి పండ్లను కాల్షియం కార్బైడ్ రసాయనాలతో కృత్రిమంగా పండించి విక్రయిస్తున్న వ్యాపారుల పట్ల జాగ్రత్త అవసరం

వార్త 2లో



## మరోమారు నోరు పారేసుకున్న ఖవాజా

2

### భారత్ దాడులు చేస్తే బుద్ది చెబుతామని హెచ్చరిక

పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. పహల్గాం దాడి జరిగి ఏడాది కావస్తున్న నేపథ్యంలో భారత్ తమపై బెదిరింపులకు పాల్పడు తోందని ఆరోపించారు. ఇవన్నీ చూస్తుంటే వారు తమపై దాడులకు ప్రణాళికలు రచిస్తూ..రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నట్లు అనిపిస్తోందన్నారు.

## టెక్స్‌టైల్‌రంగంలో తెలంగాణ అగ్రగామి

### ఇక్కడ పెట్టుబడులు పెట్టేవారికి ప్రోత్సహిస్తాం

### చేనేత, ముత్యాలకు పెట్టింది పేరు తెలంగాణ

### ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో సిఎం రేవంత్





తెలంగాణ రైజింగ్‌లో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. హైదరా బాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహిం చిన ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఉత్తమ వస్త్రాల రూప కల్పనలో భారత్‌కు గొప్ప చరిత్ర ఉంది. అనేక రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా కొనసాగుతోంది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే మా లక్ష్యం. పెట్టుబడిదారులకు కావాల్సిన అన్ని సౌకర్యా లూ కల్పిస్తాం. టెక్స్‌టైల్స్ కేవలం పరిశ్రమే కాదు.. చేనేతలకు జీవితం. దక్షిణాసియా టెక్స్‌టైల్స్ క్యాపిటల్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతాం. ప్రపం చంలోనే ఫిల్మ్ ప్రొడక్షన్ డెస్టినేషన్‌గా హైదరాబాద్ మారింది. చిత్ర పరిశ్రమను ప్రోత్స హిస్తాం. పర్యా వరణ పరిరక్షణెకి మా తొలి ప్రాధాన్యం అని రేవంత్‌రెడ్డి అన్నారు.

వార్త 2లో



## స్కూల్ ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

### ఆనాడు మాట్లాడిని రేవంత్ ఇప్పుడు మాట్లాడడం లేదు

### టిఆర్‌ఎస్ పేరు ఖాళీగా ఉంది..ఎవరైనా వాడుకోవచ్చు

### జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు

రాష్ట్రంలో స్కూల్ ఫీజుల గొడవ నడుస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 39,640 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. వీటిలో 12,061 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు. సీబీఎస్సీ సెంట్రల్ సిలబస్ ఉన్న స్కూల్స్‌లో 25 నుంచి 30 శాతం ఫీజులు పెంచి ఇప్పటినుంచే వసూలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు ఫీజు నియంత్రణ చట్టం చేయాలని రేవంత్ రెడ్డి పదే పదే మాట్లాడారని గుర్తుచేశారు. ఎవరెంత తిన్నారంటూ అసెంబ్లీలో చర్చ చేసుకున్నారే తప్ప ఫీజుల నియంత్రణపై మాట్లాడలేదని విమర్శించారు. ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించి ఫీజు నియంత్రణ చట్టం వెంటనే తేవాలని కవిత డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఫీజులను పెంచుతున్నాయే తప్ప టీచర్లకు మాత్రం జీతాలు పెంచరని విమర్శించారు.

3



## దొడ్డి కొమురయ్యకు కెసిఆర్ నివాళి

హైదరాబాద్,

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య జయంతి సందర్భంగా వారికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఘన నివాళి అర్పించారు. ప్రజా వ్యతిరేక పాలన మీద తెలంగాణ ప్రజల తిరుగుబాటుకు సంకేతంగా నిలిచిన కొమరయ్య గారి అమరత్వం, నాటి రాచరిక పాలకుల నుంచి నేటి ప్రజా



వ్యతిరేక పాలకుల మీద సాగుతున్న ప్రజా పోరాటలకు స్పూర్తిగా నిలిచిందని కేసీఆర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమాన్ని నడిపించి, రాష్ట్రాన్ని సాధించి, అనంతరం పదేండ్లపాటు బాలారిష్టాలను అధిగమించి, స్వయం పాలనను దేశానికే ఆదర్శంగా నిలబెట్టుకోవడంలో అమరుల త్యాగాల స్ఫూర్తి ఇమిడి ఉన్నదని కేసీఆర్ అన్నారు. తమ ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం, రాజకీయ హక్కుల కోసం తెలంగాణ సబ్బండ కులాల పోరాటాన్ని పాలక ప్రభుత్వాలు గుర్తించి, రాజ్యాంగ పరమైన హక్కులను అందించగలిగిన నాడే,



2 లో..

## గ్రూప్-1 నియామ కాలపై సుప్రీం తీర్పు

### ఎక్స్ వేదికగా స్వాగతించిన సిఎం రేవంత్

తెలంగాణ గ్రూప్-1 నియామకాలపై దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. ఈ తీర్పుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. తెలంగాణ గ్రూప్ -1 ఉద్యోగ నియామకాల విషయంలో భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు.



2 లో..

## కువైట్ చమురు శుద్ది కర్మాగారంపై దాడి

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. శుక్రవారం కువైట్ లోని ప్రధాన చమురుశుద్ధి కర్మాగారం మినా అల్-అహ్మదిపై ఇరాన్ డ్రోన్లతో విరుచుకుపడింది. దీంతో ఆ ప్రాంతంలో భారీఎత్తున మంటలు చెలరేగినట్లు కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ప్రకటించింది.

2 లో..



## రాఘవచద్దాను తొలగిస్తూ ఆప్ నిర్ణయం

రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ పార్టీ ఉపనేతగా ఉన్న రాఘవ్ చడ్డాను ఆ పదవి నుంచి ఆప్ తొలగించడం తీవ్ర వివాదాస్పదమైంది.

## గ్రూప్-1 నియామకాలపై సుప్రీం తీర్పు

### ఎక్స్ వేదికగా స్వాగతించిన సిఎం రేవంత్

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

తెలంగాణ గ్రూప్–1 నియామకాలపై దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. ఈ తీర్పుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. తెలంగాణ గ్రూప్ –1 ఉద్యోగ నియామకాల విషయంలో భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఇది ఉద్యోగ నియామకాల పట్ల తమ ప్రభుత్వ పారదర్శకతకు, చిత్తశుద్ధికి గుర్తింపుగా భావిస్తున్నామన్నారు. కొలువుల కోసం సంవత్సరాల తరబడి కళ్లు కాయలు కాచేలా ఎదురు చూసి, కన్నవారి కష్టంపై ఆధారపడలేక, కొలువు వస్తుందో రాదో అన్న దిగులుతో పదేళ్లు కాలం వెళ్లదీసిన గ్రూప్ –1 ఆశావహులకు ఇది పెద్ద ఊరటగా చెప్పుకొచ్చారు. ప్రజా ప్రభుత్వం వచ్చీ రావడంతోనే నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలో నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ నియామకాలను అడ్డుకోవాలనుకున్న దుష్ట శక్తుల కుట్రలను కుతంత్రాలను ఛేదించి, రాష్ట్ర పునర్ నిర్మాణంలో తొలి గ్రూప్ –1 అధికారులుగా యువతను భాగస్వాములను చేశామని వెల్లడించారు. వారికి మరోసారి సీఎం అభినందనలు తెలియజేశారు. ప్రభుత్వం ఆలోచనలు, సంకల్పానికి అనుగుణంగా టీజీపీఎస్సీ వ్యవస్థను ప్రక్షాళన చేసి, నిరుద్యోగ యువతకు వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించి, అత్యంత పారదర్శకంగా ఈ నియామకాలను పూర్తి చేసిన టీజీపీఎస్సీ ఛైర్మన్, ఉద్యోగులు, సిబ్బందికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ ట్వీట్ చేశారు.

## సాండ్ మాఫియా చేతుల్లోకి ఇసుక ఆదాయం

### నిజాలు బయటపెట్టి లెక్కలు చెప్పాలి

### బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్రంలో ఇసుక తవ్వకాల ఆదాయంపై కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేస్తున్న గణాంకాలు పూర్తిగా తప్పుదోవ పట్టించే విధంగా ఉన్నాయని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో ఇసుక తవ్వకాల ద్వారా వచ్చిన ఆదాయం కేవలం 39 కోట్లే అని తెలిపారు. కానీ కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న సంస్కరణలతో ఇసుక ఆదాయం గణనీయంగా పెరిగిందని అన్నారు. ఒక్క సంవత్సరంలోనే రూ.886 కోట్లకు చేరిందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇసుక ధర టన్నుకు రూ.645 మాత్రమే ఉండేదని.. ప్రజలకు అందుబాటులో ఉండేదని క్రిశాంక్ తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో సాండ్ బజార్ పేరుతో ఇసుక ధరను రూ.1600కు పెంచి, అదనంగా రవాణా భారం కూడా ప్రజలపై మోపుతోందన్నారు. సర్వీస్ ఛార్జీలు టన్నుకు కాంగ్రెస్ ప్రభుత్వం ?3 నుంచి ?100కు పెంచబడినప్పటికీ, ఆదాయం మాత్రం పెరగకపోవడం అనుమానాస్పదమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాలంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు మాత్రమే ఇసుక తవ్వకాలు జరగ్గా, ఇప్పుడు పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించి ఉదయం 6 నుంచి రాత్రి 9 వరకు తవ్వకాలు, 24 గంటల రవాణా అనుమతించినప్పటికీ ఆదాయం రెట్టింపు కాలేదని మన్నె క్రిశాంక్ తెలిపారు. ఈ పరిస్థితి చూస్తే ఇసుక ఆదాయం సాండ్ మాఫియా చేతుల్లోకి వెళ్లిపోతుందనే అనుమానాలు బలపడుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా, ప్రస్తుత ముఖ్యమంత్రి కార్యాలయ సీపీఆర్వోగా ఉన్న గుర్రం మల్సూర్ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో టీఎస్ఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు. కాబట్టి, ఆయనకు వాస్తవ గణాంకాలు బాగా తెలుసని క్రిశాంక్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ విజయాలను వక్రీకరించి, తప్పుడు గణాంకాలతో ప్రజలను మోసం చేస్తోంది అనే విషయంపై సీపీఆర్వో మల్సూర్ వెంటనే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇసుక తవ్వకాల ఆదాయంపై పారదర్శకత కోసం పూర్తి వివరాలు ప్రజలకు వెల్లడించాలన్నారు. తెలంగాణ ప్రజలపై భారం మోపుతూ, వాస్తవాలను దాచిపెట్టి ప్రభుత్వాన్ని నడపడం సరికాదని హితవుపలికారు. నిజాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

## కల్తీ మామిడి పండ్లతో జాగ్రత్త

### కార్బైడ్ మామిడి పల్లను గుర్తించండి: సజ్జనార్

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

మామిడిపండ్ల సీజన్ ప్రారంభం అయ్యింది. నగరంలో నోరూరించే పళ్లు కనిపిస్తున్నారు. ఇదే అదనుగా కొందరు వ్యక్తులు కల్తీ మామిడి విక్రయాలకు పాల్పడటం ఆందోళనకు గురిచేసే విషయం. మామిడి పండ్లను కాల్షియం కార్బైడ్ రసాయనాలతో కృత్రిమంగా పండించి విక్రయిస్తున్న వ్యాపారుల పట్ల జాగ్రత్త అవసరం. ఈ కల్తీ పండ్ల వల్ల ఆరోగ్య సమస్యలు రావడమే కాకుండా క్యాన్సర్ ముప్పు పొంచి ఉంటుందంటున్నారు నిపుణులు. ఈ విషయమై హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ.సజ్జనార్ ఎక్స్ వేదికగా స్పందించారు. వేసవి కాలం రాకతో మామిడి మార్కెట్‌లో సందడి చేస్తోందని సజ్జనార్ అన్నారు. అయితే.. నోరూరించే ఈ ఫలాల మాటున ప్రాణాంతకమైన విషకోరలు దాగున్నాయన్న నిజాన్ని ప్రజల మరవకూడదని హెచ్చరిస్తూ.. 'కల్తీ మామిడి పండ్లతో తస్మాత్ జాగ్రత్త!' అని ఎక్స్ వేదికగా వివరించారు. మార్కెట్లలో ఎక్కడైనా కల్తీ మామిడి పండ్లను విక్రయించినా, ఆ సమాచారం తెలిసినా వెంటనే డయల్ 100కి గానీ, హెచ్–ఫాస్ట్ ఫోన్ నంబర్ 8712661212కు కాల్ చేయాలని సజ్జనార్ సూచించారు.

## కువైట్ చమురుశుద్ధి కర్మాగారంపై దాడి

### డ్రోన్లతో విరుచుకు పడ్డ ఇరాన్

### పెద్ద ఎత్తున మంటలు చెలరేగినట్లు కువైట్ ప్రకటన

**కువైట్ సిటీ, అక్షరకలం ప్రతినిధి**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. శుక్రవారం కువైట్ లోని ప్రధాన చమురుశుద్ధి కర్మాగారం మీనా అల్–అహ్మదిపై ఇరాన్ డ్రోన్లతో విరుచుకుపడింది. దీంతో ఆ ప్రాంతంలో భారీఎత్తున మంటలు చెలరేగినట్లు కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ప్రకటించింది. మంటలు అదుపు చేయడానికి అగ్నిమాపక సిబ్బంది కృషి చేస్తున్నారని పేర్కొంది. ఈ దాడిలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని తెలిపింది. ప్రపంచంలోని అతిపెద్ద చమురు శుద్ధి కర్మాగారాల్లో మీనా అల్–అహ్మది ఒకటి. కువైట్ చమురు ఉత్పత్తికి ఇది చాలా కీలకం. మీనా అల్–అహ్మది కర్మాగారం నుంచి రోజుకు 3,46,000 బ్యారెళ్ల చమురును ఉత్పత్తి చేస్తారు. దాదాపు లక్షల బ్యారెళ్ల మేర డీజిల్, ఇతర శుద్ధి చేసిన ఇంధనాలను ఆసియా, యూరప్‌లోని మార్కెట్లకు ఎగుమతి చేస్తూ.. ప్రభుత్వానికి కీలకమైన ఆదాయ వనరుగా నిలుస్తోంది. ఈ కర్మాగారం లేకపోతే అక్కడ ఉత్పత్తి అయ్యే చమురును శుద్ధి చేయలేక బావులను మూసివేయాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. ఇక్కడినుంచి భారత్‌తో సహా ఇతర ప్రపంచదేశాలు చమురు దిగుమతి చేసుకుంటాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రస్తుతం భారత్.. కువైట్ నుంచి చమురు దిగుమతులు నిలిపివేసింది. జాతీయ ఆయిల్ కంపెనీపై డ్రోన్ దాడి జరిగినట్లు కువైట్ న్యూస్ ఏజెన్సీ శుక్రవారం పేర్కొంది. దీంతో పలు యూనిట్లలో మంటలు చెలరేగాయని తెలిపింది. ఉదయం మినా అల్–అహ్మదీ రిఫైనరీ లక్ష్యంగా డ్రోన్ దాడి జరిగిందని కువైట్ పెట్రోలియం కార్పోరేషన్ (కెపిసి) మీడియాకు తెలిపింది. ఫలితంగా పలు యూనిట్లలో మంటలు చెలరేగాయని, అత్యవసర బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నాయని పేర్కొంది. గల్ఫ్ భూభాగంపైకి ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్‌లను వైమానిక రక్షణవ్యవస్థ సమర్థవంతంగా అడ్డుకుంటుందని కువైట్ సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. దేశవ్యాప్తంగా సైరన్‌లు మోగుతున్నాయని బహ్రెయిన్ అంతర్గత మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేసింది. మరిన్ని వివరాలు వెల్లడించేందుకు నిరాకరించింది.

# టెక్స్‌టైల్‌రంగంలో తెలంగాణ అగ్రగామి




### ఇక్కడ పెట్టుబడులు పెట్టేవారికి ప్రోత్సహిస్తాం

### చేనేత, ముత్యాలకు పెట్టింది పేరు తెలంగాణ

### ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్







**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

తెలంగాణ రైజింగ్‌లో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఉత్తమ వస్త్రాల రూపకల్పనలో భారత్‌కు గొప్ప చరిత్ర ఉంది. అనేక రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా కొనసాగుతోంది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే మా లక్ష్యం. పెట్టుబడిదారులకు కావాల్సిన అన్ని సౌకర్యాలూ కల్పిస్తాం. టెక్స్‌టైల్స్ కేవలం పరిశ్రమే కాదు.. చేనేతలకు జీవితం. దక్షిణాసియా టెక్స్‌టైల్స్ క్యాపిటల్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతాం. ప్రపంచంలోనే ఫిల్మ్ ప్రొడక్షన్ డెస్టినేషన్‌గా హైదరాబాద్ మారింది. చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తాం. పర్యావరణ పరిరక్షణెళి మా తొలి ప్రాధాన్యం అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన టెక్స్‌టైల్ రంగ ప్రముఖులకు స్వాగతం పలుకుతూ, తెలంగాణను ప్రపంచ వస్త్ర రంగ పటంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వ దార్శనికతను పంచుకున్నారు.తెలంగాణకు వస్త్ర రంగంతో ఉన్న చారిత్రక అనుబంధాన్ని గుర్తుచేశారు. భారతదేశానికి అత్యుత్తమ వస్త్రాలను తయారు చేసిన గొప్ప చరిత్ర ఉంది. తెలంగాణ గర్వంగా చెబుతోంది.. టెక్స్‌టైల్ మన డిఎన్ఎలోనే ఉంది. నిజాం కాలంలోనే ప్రపంచ నలుమూలల నుండి వ్యాపారులు హైదరాబాద్ కు వచ్చి వస్త్రాలు, ముత్యాలు కొనుగోలు చేసేవారు అని ఆయన పేర్కొన్నారు. కేవలం పరిశ్రమగానే కాకుండా, ఇది లక్షలాది మందికి జీవనాధారమని.. పోచంపల్లి ఇక్కత్, గద్వాల్ చీరలు, వరంగల్ దుర్రీస్ వంటివి మన సంస్కృతికి ప్రతీకలని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047' గురించి ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధిపై స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను వివరిస్తూ, 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను సీఎం ప్రకటించారు. ఇందులో భాగంగా 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడమే లక్ష్యం అని పేర్కొన్నారు. ఇంకా 2047 నాటికి తెలంగాణను దక్షిణ ఆసియాలోనే టెక్స్‌టైల్ రాజధానిగా మార్చడమే మా సంకల్పం అని అన్నారు. అలాగే వరంగల్‌లో ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ద్వారా ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పత్తి నాణ్యతకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని, పత్తి ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రగామిగా ఉందని సీఎం అన్నారు. ఈ సందర్భంగా పెట్టుబడిదారులకు ఆయన పిలుపునిస్తూ.. 'మీకు విజన్ ఉంటే, మేము మీకు సరైన భాగస్వాములం. మౌలిక సదుపాయాలు, భూమి, విద్యుత్, నీరు, వేగవంతమైన అనుమతులతో పాటు ప్రపంచ స్థాయి విధానాలను మా ప్రభుత్వం అందిస్తుంది అంటూ హామీ ఇచ్చారు. డీప్ టెక్, ఫార్మా, ఏరోస్పేస్ వంటి రంగాల్లో ఇప్పటికే ముందంజలో ఉన్న తెలంగాణ, ఇప్పుడు టెక్స్‌టైల్ ఎకోసిస్టమ్ ను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. మరోవైపు హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచ సినిమా నిర్మాణ కేంద్రంగా ఎదుగుతోందని, నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలు ఇక్కడ స్టూడియోలను ప్రారంభించడాన్ని ఆయన ప్రస్తావించారు. టాలీవుడ్, బాలీవుడ్ మాత్రమే కాక హాలీవుడ్ కూడా హైదరాబాద్ ను కేంద్రంగా చేసుకుంటున్న తరుణంలో సినిమా రంగానికి అవసరమైన ఫ్యాషన్ ను కూడా తెలంగాణ నుంచే అందించేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. అదే సమయంలో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ 'గ్రీన్ టెక్స్‌టైల్ హబ్' లను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు.

## మరోమారు నోరు పారేసుకున్న ఖవాజా

### భారత్ దాడులు చేస్తే బుద్ధి

### చెబుతామని హెచ్చరిక

**ఇస్లామాబాద్, అక్షరకలం ప్రతినిధి**

పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. పహల్గాం దాడి జరిగి ఏడాది కావస్తున్న నేపథ్యంలో భారత్ తమపై బెదిరింపులకు పాల్పడు తోందని ఆరోపించారు. ఇవన్నీ చూస్తుంటే వారు తమపై దాడులకు ప్రణాళికలు రచిస్తూ..రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నట్లు అనిపిస్తోందన్నారు. మరోసారి తమతో ఘర్షణకు దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తమపై జరిగే దాడులను వేగవంతమైన, ప్రణాళికాబద్ధమైన ప్రతిస్పందనతో తిప్పికొడతామ న్నారు. ఇరాన్ యుద్ధాన్ని అవకాశంగా తీసుకొని పొరుగుదేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఇటీవల కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ పాక్‌ను హెచ్చరించారు. ఉరి సెక్టార్ దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత వైమానిక దాడులు, పహల్గాం దాడుల అనంతరం ఆపరేషన్ సిందూర్‌లను గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఖవాజా ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## రాఘవచద్దాను తొలగిస్తూ ఆప్ నిర్ణయం

### సభలో మాట్లాడే అవకాశం ఇవ్వరాదని లేఖ

### ఆప్ తీరుపై మండిపడ్డ రాఘవ్ చద్దా

### ప్రజా సమస్యలపై గొంతెత్తితే తట్టుకోలేరా?

### వీడియో విడుదల చేసిన రాఘవ్ చద్దా

**న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**

రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ పార్టీ ఉపనేతగా ఉన్న రాఘవ్ చద్దాను ఆ పదవి నుంచి ఆప్ తొలగించడం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై ఆప్ ఎంపీ రాఘవ్ చడ్డా తాజాగా స్పందించారు. తానేం తప్పు చేశానంటూ పార్టీని బహిరంగంగా ప్రశ్నించారు. ఇలాంటి ప్రయత్నాలతో తన గళాన్ని అణచివేయగలరేమో గానీ.. తనను ఓడించలేరంటూ ఓ వీడియో సందేశం విడుదల చేశారు. పార్లమెంట్‌లో నాకు ఎప్పుడు మాట్లాడే అవకాశం లభించినా.. ప్రజా సమస్యలనే లేవనెత్తుతా. బహుశా నేను ప్రస్తావించే అంశాలను సభలో సాధారణంగా చర్చించరేమో. కానీ, ప్రజా సమస్యలను ఎత్తిచూపడం ఏమైనా నేరమా అని నిలదీశారు. నేనేమైనా తప్పు చేశానా? పార్లమెంట్‌లో నాకు మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని మా పార్టీ స్వయంగా రాజ్యసభ సెక్రటరీకి చెప్పింది. అందుకే ఈ రోజు నేను ఈ ప్రశ్నలు అడగాల్సి వచ్చింది. ఎయిర్‌పోర్టుల్లో ఆహార ధరలు, గిగ్ వర్కర్ల సమస్యలు, టోల్ ప్లాజా దోపిడీ, టెలికాం కంపెనీల రీఛార్జ్ విధానాల సమస్యలను లేవనెత్తితే.. అది ఆమ్‌ఆద్మీ పార్టీకే ప్రయోజనం కదా అని అన్నారు. మొన్నటికి మొన్న వివిధ రకాల పన్నులుపై నిలదీశారు. దీనివల్ల పార్టీకి ఏం నష్టం జరుగుతోంది? ఎందుకు నన్ను మాట్లాడకుండా అడ్డుకుంటున్నారు? ఇలాంటి చర్యలతో నా గళాన్ని మీరు అణచివేయగలరు. కాని, ఇది నా ఓటమి కాదు. ప్రజలు నా పక్షాన ఉన్నారు. వారికోసం ఎంత దూరమైనా వెళ్తా. నేను నదిలాంటి వాడిని. సమయం వచ్చినప్పుడు వరదలా విరుచుకుపడతా అని రాఘవ్ చడ్డా తన వీడియోలో పేర్కొన్నారు. రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ పార్టీ డిప్యూటీ లీడర్‌గా రాఘవ్ చడ్డాను తొలగించిన ఆప్.. ఆ హోదాలో మరో ఎంపీ అశోక్ మిత్తల్‌ను నియమించింది. ఆప్ నిర్వహిస్తున్న కార్యకలాపాలకు చడ్డా దూరంగా ఉంటుండటం, పార్టీ కార్యక్రమాలపై స్పందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. రాఘవ్ చడ్డా భాజపాలో చేరనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తోన్న వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం తీవ్ర చర్చనీయాంశ మైంది.ఎంపి రాఘవ చద్దాని ఉపనాయకుడి పదవి నుంచి తొలగించాలని గురువారం రాజ్యసభ సచివాలయానికి ఆ పార్టీ లేఖ రాసింది. సభలో రాఘవ చద్దాని మాట్లాడనివ్వకూడదని కూడా ఆ లేఖలో ఆప్ పేర్కొంది. దీనిపై ఆప్ ఎంపి రాఘవ్‌చద్దా శుక్రవారం స్పందించారు. పార్లమెంటులో ప్రజా సమస్యలను లేవనెత్తడం నేరమా? నేను ఏదైనా తప్పు చేశానా? అని ఆప్‌ని ప్రశ్నించారు. ఈ మేరకు ఓ వీడియోను ఆయన శుక్రవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. నాకు ప్రజల మద్దతు ఉంది. నా మౌనాన్ని నా ఓటమిగా పొరపాటు పడకండి అని రాఘవ్ చద్దా వీడియోలో తెలిపారు.



# స్కూల్ ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

**ఆనాడు మాట్లాడిని రేవంత్ ఇప్పుడు మాట్లాడడం లేదు**

**టీఆర్ఎస్ పేరు ఖాళీగా ఉంది..ఎవరైనా వాడుకోవచ్చు**

**జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు**

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

రాష్ట్రంలో స్కూల్ ఫీజుల గొడవ నడుస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 39,640 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. వీటిలో 12,061 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు. సీబీఎస్సీ సెంట్రల్ సిలబస్ ఉన్న స్కూల్స్‌లో 25 నుంచి 30 శాతం ఫీజులు పెంచి ఇప్పటినుంచే వసూలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు ఫీజు నియంత్రణ చట్టం చేయాలని రేవంత్ రెడ్డి పదే పదే మాట్లాడారని గుర్తుచేశారు. ఎవరెంత తిన్నారంటూ అసెంబ్లీలో చర్చ చేసుకున్నారే తప్ప ఫీజుల నియంత్రణపై మాట్లాడలేదని విమర్శించారు. ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించి ఫీజు నియంత్రణ చట్టం వెంటనే తేవాలని కవిత డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఫీజులను పెంచుతున్నాయే తప్ప టీచర్లకు మాత్రం జీతాలు పెంచరని విమర్శించారు. ప్రైవేట్ కాలేజీల్లో ఆహార నాణ్యతను ప్రభుత్వం పట్టించుకోదా అని ప్రశ్నించారు. ప్రైవేట్ పాఠశాలలు, ఆసుపత్రులను సీఎం ప్రారంభిస్తున్నారని... వాళ్ళ దోపిడిని ఎంకరేజ్ చేస్తున్నారా అంటూ నిలదీశారు. ప్రైవేట్ స్కూల్స్ దోపిడీని కంట్రోల్ చేయాలని ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే స్కూల్స్ ముందు ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. 'అన్ని శాఖలకు ముఖ్యమంత్రే మంత్రిగా ఉండటం మన కర్మ' అంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో తనను నిజామాబాద్‌కు పరిమితం చేశారని అన్నారు. ఆంధ్రా, నార్త్ ఇండియా వాళ్ళు ఇక్కడ విద్యా సంస్థలు నెలకొల్పినా తెలంగాణ వాళ్ళకే అవకాశం ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు.అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న స్కూల్ యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని.. అధిక ఫీజుల వసూళ్లను కట్టడి చేయాలని కోరారు.తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరు ఫ్రీ అయిందని.. ఇప్పుడు దాన్ని ఎవరైనా వాడుకోవచ్చన్నారు. ఆచార్య జయశంకర్ సిద్ధాంతాల ప్రకారమే తమ పార్టీ నడుస్తుందని చెప్పారు. తమ పార్టీకి బిహార్ సిద్ధాంతకర్త అంటూ ఎవరూ లేరన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని విమర్శించారు.

# కోండ్రోనిపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం,

**(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఏప్రిల్, 03)**



నారాయణపేట జిల్లా, ధన్వాడ మండలం కోండ్రోనిపల్లి గ్రామంలో ,(ఎన్ ఆర్ ఓ జి ఎస్) నిధుల నుండి 5 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ విషయమై మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలను దశలవారీగా తీర్చుకుంటూ ముందుకు సాగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పి.సుదకర్, పంచాయతీ కార్యదర్శి సౌందర్య, ఆధ్వర్యంలో సిసి రోడ్డు పనులు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు, గ్రామ యువకులు ,పెద్దలు, మహిళలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బాబు జగ్జీవన్ రామ్ జయంతిని విజయవంతం చేయండి:

**జయంతి వేడుకల ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి అడ్లూరి..**

**హైదరాబాద్: ఏప్రిల్ 3,( అక్షర కలం న్యూస్ ):**



బాబు జగ్జీవన్ రామ్ జయంతిని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఏప్రిల్ 5వ తేదీన నిర్వహించే బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాల ఏర్పాట్లను శుక్రవారం హైదరాబాద్ లో మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతిని ప్రతి ఏటా ఏప్రిల్ 5వ తేదీన నిర్వహిస్తున్నామని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన బాబు జగ్జీవన్ రామ్ 30 ఏళ్లకు పైగా కేంద్ర మంత్రి వర్గంలో పనిచేశారని మంత్రి గుర్తు చేశారు. అతి చిన్న వయసులోనూ కార్మిక శాఖ మంత్రి గా పనిచేశారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రక్షణ, వ్యవసాయశాఖ మంత్రితో పాటు దేశ ఉప ప్రధానిగా పని చేసి దళితుల అభ్యున్నతికి కృషి చేశారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఏప్రిల్ 5వ తేదీన హైదరాబాద్ లో నిర్వహించే బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని మంత్రి అడ్లూరి పిలుపునిచ్చారు.

# గిరిజనుల రిజర్వేషన్లు పెంచాం

**తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చాం**

**ఫీజు రియంబర్స్‌మెంట్ కూడా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం**

**బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు**

**నారాయణపేట**

గిరిజనులకు ఉన్న 6 శాతం రిజర్వేషన్‌ని 10 శాతానికి పెంచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనతా ఆయనకే దక్కుతుందన్నారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం బావోజీ జాతరకు మాజీ మంత్రులు హరీశ్ రావు, శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ..'లోక్ మసంద్ మహారాజ్ జాతరకు రావడం సంతోషంగా ఉంది. ఈ ప్రాంతానికి రూ.8 కోట్లతో బ్రిడ్జి వేయించింది మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి. ఈ దేవాలయ అభివృద్ధికి, గిరిజనుల అభివృద్ధికి కేసీఆర్ ఎంతో చేశారు. మా తండాలో మా రాజ్యం అంటే ఎవ్వరూ పట్టించుకోలేదు. తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌ది. అన్ని రంగాల్లో కేసీఆర్ వారికి రిజర్వేషన్లు తెచ్చారు. గిరిజనులకు ఇప్పుడు కాంగ్రెస్ చేసింది గుండు సున్నా. ఎస్సీ, ఎస్టీలకు డిక్లరేషన్ ఇచ్చి వారు చేసిందేమీ లేదు. రూ.2,730 కోట్లు ఎస్టీలకు బ్జడెట్‌లో పెట్టి కేవలం రూ.50 కోట్లే ఖర్చు చేశారు. గిరిజన విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు.. ఒక్కరికీ ఇవ్వలేదు. పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యకు దూరం చేస్తున్నారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.వేల కోట్లు ఇచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు కూడా ఇవ్వడం లేదని ఆక్షేపించారు.

# నగరంలో చట్టాన్ని అతిక్రమించి నడుస్తున్న ఇతర డిస్ట్రిక్ ఆటోలను అరికట్టే భాధ్యత ప్రభుత్వానిదే.....

**ఫ్యూచర్ సిటి ఐ.ఎల్.డబ్లు.ఎఫ్ ఆటో యునియన్ కన్వీనర్ ఉస్మాన్ బిన్ అవల్గీ :**

**హైదరాబాద్ : ఏప్రిల్ 3, ( అక్షర కలం న్యూస్ )**




డిస్టిక్ ఆటోలు పర్మిట్ ఉన్న ప్రాంతంలోనే నడపాలని, చట్ట వ్యతిరేకంగా జిల్లా ఆటోలు ఇతర జిల్లాలలో నడపకుండా అరికట్టవలసిన భాద్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని ఇండియన్ లెబర్ వర్కర్స్ ఫెడరేషన్ ఫ్యూచర్ సీటీ ఆటో యునియన్ కన్వీనర్ పేర్కొన్నారు. ఏ జిల్లాకి సంబందించిన ఆటోలు ఆ జిల్లాలోనే నడపాలని 2002 లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్, మరియు సుప్రీమ్ కోర్ట్ ఇచ్చిన తీర్పును జిల్లా ఆటోలు భేఖాతరు చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వం ఈ విషయాన్ని గమనిస్తూ ఉరుకోవడం కూడా సరికాదన్నారు. ఇప్పటికే నగర పర్మిట్ ఆటోలు ఓలా, ఉబర్, ర్యాపిడో లతో తిప్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. జిల్లా ఆటోలు నగరంలో చట్ట వ్యతిరేకంగా తిరగడంతో సరైన గిరాకిలు మాకు లేకపోవడంతో మా కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఇకనైన సంబందిత ట్రాన్స్పోర్ట్ అధికారులు ఇతర జిల్లాల ఆటోలను నగరంలో నడవకుండా అడ్డుకోకపోతే మా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు.ఇంకా ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ అలీమ్, దావూద్, ఇమ్రాన్, భైరాంఖాన్, ఎజాస్ తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా శ్రీరాం ఫుడ్స్ ప్రారంభం...హాజరైన ప్రముఖులు



మండలంలోని పారుపల్లి గ్రామానికి చెందిన ప శ్రీరామ్ బేకరీ ఫౌండర్ కట్కూరి సుధా విజయ్ కుమార్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో హైదరాబాద్ చర్లపల్లిలో నెలకొల్పిన శ్రీరామ్ బేకరీ ఫుడ్ స్వీట్ ను శుక్రవారం మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ మేయర్ రామ్మోహన్ లు అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ కుటుంబంలో పుట్టిన విజయకుమార్ రెడ్డి హైదరాబాద్ నగరంలో శ్రీరామ్ బేకరీ ఫౌండర్ గా వ్యాపారంలో రాణించడం అభినందనీయమన్నారు. సందర్భంగా విజయ కుమార్ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే, కార్పొరేటర్లు, నాయకులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, మల్లాపురం మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, నాయకులు గిరెడ్డి ముకుంద రెడ్డి, సీనియర్ న్యాయవాది నగర ప్రసాద్, రాజాపేట మాజీ వైస్ ఎంపీపీ రాపోలు రేణుక రామిరెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాపోలు లక్ష్మారెడ్డి, మాజీ ఎంపిటిసి రాపోలు కవితా తిరుపతిరెడ్డి, బిజెపి మండల నాయకులు గిరెడ్డి జితేందర్ రెడ్డి, గిరెడ్డి దామోదర్ రెడ్డి, కట్కూరి బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

# విద్యార్థులకు విద్యతోపాటు సాంప్రదాయాలను అందించాలి

**సూర్యాపేట డిఎస్పీ ప్రసన్న కుమార్**



విద్యార్థులకు విద్యతో పాటు మన సాంస్కృతి, సాంప్రదాయాలను అందించాలని పాఠశాల స్థాయిలోనే అందించాలని డిఎస్పీ ప్రసన్న కుమార్, పట్టణ సిఐ వెంకటయ్య అన్నారు. గురువారం రాత్రి జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ రోడ్డులో నారాయణ హైస్కూల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థి దశ నుండే వారికి సన్మార్గంతో పాటు విద్యలో రాణించేలా చూడాలన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుండే సక్రమమైన మార్గంలో మంచి విద్యను అభ్యసించడంతో రానున్న రోజుల్లో ఉన్నతమైన స్థానాలను అధిరోహిస్తారని తెలిపారు. విద్యార్థులకు చిన్నతనం నుండే నైతిక విలువలు, క్రమశిక్షణ, శ్రద్ధ వంటి లక్షణాలను నేర్పుతూ ఉత్తమ పిల్లలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు మెరిట్ సర్టిఫికేట్ లను అందజేశారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏజీఎం గుత్తికొండ రమేష్ రెడ్డి, ప్రిన్సిపల్ శ్వేత, అకాడమిక్ ఏడిలు నాగరాజు, వెంకన్న, వైస్ ప్రిన్సిపల్స్ గీత, వైష్ణవి, కోఆర్డినేటర్స్ సభ, మహేశ్వరి, ఏవోలు రహీముద్దీన్, శంకర్, ఉపాధ్యాయులు ఇటుకల సైదులు, రవీందర్, ప్రభాకర్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు

ప్రేమ కరుణ సహనంతో సర్వం సుసాధ్యం చేయవచ్చని నిరూపించిన ఏకైక వ్యక్తి యేసు ప్రభువు అని సూర్యాపేట ఆర్సీఎం చర్చ్ ఫాదర్ రెవరెండ్ కస్పారెడ్డి పేర్కొన్నారు. పరిశుద్ధ శుక్రవారం (గుడ్ ఫ్రైడే) సందర్భంగా శుక్రవారం నిర్మల చర్చి ఆధ్వర్యంలో సిలువ దారి ఏసుక్రీస్తు చివరి రోజులను నాటక రూపంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని నిర్మల చర్చ వద్ద ప్రారంభమైన పరిశుద్ధ సిలువ మార్గం కార్యక్రమం అంబేద్కర్ బొమ్మ, శంకర్ విలాస్, గాంధీ బొమ్మ, ఆకారపు సుదర్శన్ బొమ్మ నుండి నిర్మల ఆసుపత్రిలోని కల్వరికొండ వరకు నిర్వహించారు. యేసుక్రీస్తు మరణానికి సంబంధించిన 14 గుర్తులను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం కస్పారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ మానవాళిని పాపముల నుండి విముక్తులు చేసేందుకు క్రీస్తు ప్రభువు సిలువపై మరణం పొందాడని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు పాపాల నుండి విముక్తులు కావాలని సూచించారు. ఏసుప్రభువు కల్మషం లేకుండా జీవించి శారీరకంగా మరణించినా తిరిగి పునరుత్థానుడయ్యారని తెలిపారు. ప్రజలు యేసు ప్రభువు చూపిన మార్గంలో పయనిస్తూ తోటి వారి పట్ల ప్రేమానురాగాలను కలిగి, క్షమాగుణం ఆప్యాయత అనురాగాలను కలిగి ఉండాలన్నారు. చెడు వ్యసనాలను త్యజించి ప్రభు చూపించిన సన్మార్గం మార్గంలో నడవాలని ఆకాంక్షించారు. అనంతరం సాయంత్రం ఆర్.సి.యం చర్చిలో సిలువ ముద్దు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇతర ఫాదర్ లు, నిర్మల సిస్టర్స్, ఏ వి యం సిస్టర్స్, కాన్సిల్ మెంబెర్స్ ముక్కలా మర్రెడ్డి, వల్లమల్ల బాలాస్వామి, పిండిగ అజయ్, నాగటి ఏసుదాసు, బంధ శ్యాంసన్, పట్టేటి బాలశౌరి, పాండురంగీ బాలరాజు, గోపికిరణ్, కతోలిక విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# జగన్..... చపలచిత్త రాజకీయాలు !

ంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రాజకీయాలు సూస్తుంటే ..ఇంతటి అపరిపక్వ రాజకీయ నేతను చూసి ఉండమేమో అనిపిస్తుంది. చంద్రబాబు మీద వ్యతిరేకత ఉన్నవారు సైతం రాజధాని విషయంలో వ్యతిరేకించడం లేదు. ఏ విషయంలోనూ స్పష్టత లేని జగన్ ఐదేళ్ల పాటు ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేశారు. అతి తక్కువ సమయంలో సిఎంగా ప్రజలు ఆదరిస్తే, దానిని అద్భుత అవకాశంగా తీసుకుని, దార్శనికతను ప్రదర్శించాల్సిన జగన్, తన ఫ్యాక్షన్ రాజకీయతనుజోడించి అభాసుపాలయ్యారు. అధికారంలో ఉండగా మూడు రాజధానులు అంటూ, రాజధాని రైతులను రాచిరంపాన పెట్టారు. అమరావతి ని వేశ్యల రాజధాని అన్నారు. అదో కమ్మ సామ్రాజ్యం అన్నారు. మూడు రాజధానులంటూ ఊదరగొట్టి, అసలు రాజధాని లేకుండా ఐదేళ్లు కాలం గడిపారు. ఇప్పుడేమో మావిగన్ అంటూ జగన్ కొత్త పల్లవి అందుకున్నారు. ఇవన్నీ చూస్తుంటే జగన్‌లో ఓ అపరిచితుడు ఉన్నాడా అన్న అనుమానాలు కలుగు తున్నాయి. రాజధాని అమరావతి రైతులకు న్యాయం జరగడం లేదంటున్న వ్యక్తి, తన సొంతింట్లో సొంత చెల్లెలికి మాత్రం న్యాయం చ ఏయడం లేదు. హక్కుగా ఉన్న ఆస్తిని పంచడం లేదు. తల్లి చెప్పినా వినడం లేదు. అంతెందుకు రాజధాని విషయంలో ఏం మాట్లాడుతున్నారో ఆయనకైనా అర్థం అవుతందా అన్నది అర్థం కావడం లేదు. మూడు రాజధానులు అన్నారు. అసలు రాజధాని అవసరం లేదంటున్నాడు. మావిగన్ అంటున్నాడు. అంటే చిత్తశుద్ధి, స్థిర సంకల్పం లేని రాజకీయ నేతగా జగన్‌ను చూడాలి. ఇలాంటి వారు అధికారంలో ఉండగా ఎంతగా తెగించారో చూశాం. అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానుల పాట పాడిన వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్.. ఇప్పుడు 'ప్లాన్-బి' పేరుతో కొత్త పల్లవి అందుకున్నారు. విశాఖలో ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ నచ్చకపోతే.. ప్లాన్-బీ కింద మచిలీపట్నం (మా) -విజయవాడ (వి)-గుంటూరు (గన్) నగరాలను రాజధానిగా అభివృద్ధి చేయొచ్చని సెలవిచ్చారు. దీనికి ఎంచక్కా 'మావిగన్' అని పేరు పెట్టొచ్చన్నారు. 'గన్'లో తన పేరు ఉన్నందున, అది నచ్చకపోతే ఇంకోపేరు పెట్టుకోవచ్చని కూడా సలహా ఇచ్చారు. మచిలీపట్నం-విజయవాడ-గుంటూరు మధ్య 110 కిలోమీటర్ల హైవే ప్రాంతం పరిధిలో 110 ఎకరాల్లో రాజధాని నగరాన్ని ఏర్పాటు చేయొచ్చని జగన్ పేర్కొన్నారు. 'మావిగన్'పై తన అభిప్రాయాన్ని విన్నాక .. రాష్ట్ర ప్రజలు తనతో ఏకీభవిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. అమరావతి మాత్రం ఆచరణ సాధ్యం కాదని తేల్చేశారు. భవిష్యత్తులో తమ ప్రభుత్వం వచ్చాక అసెంబ్లీలో చట్ట సవరణ ద్వారా రాజధానిని మార్చేస్తామని కూడా ప్రకటించారు. గతంలో తుగ్లక్ కూడా ఇలాగే చేశారు. ఇష్టం వచ్చినట్లుగా రాజధానిని మార్చేశారు. ఇప్పుడు జగన్ చేస్తున్న లేదా చెబుతున్నది అలాగే ఉంది. అంతెందుకు అసలు రాష్ట్రాలకు రాజదాని అసవరం లేదని సెలవిచ్చారు. గతంలో ఆయనగారు తాను అంటే సిఎం ఎక్కడ ఉంటే అదే రాజధాని అన్నారు. దీనిపై మాజీమంత్రి సోమిరెడ్డి సెటైర్లు వేశారు. లాట్రిన్‌లో ఉంటే అదే రాజధాని అవుతుందనుకోవాలా అని ఆన్నారు. రాజ్యాంగంలో దేశ రాజధానిపై నిర్వచనం ఉందే తప్ప.. రాష్ట్రాల రాజధాని ప్రస్తావనే ఎక్కడా లేదని జగన్ చెప్పడం ఆయన అవివేకానికి పరాకాష్టగా చెప్పుకోవాలి. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులో చట్ట సవరణ చేసినా నిలువదంటున్నారు. భవిష్యత్‌లో ప్రజాభీష్టం మేరకు ఏర్పడే రాష్ట్రప్రభుత్వం.. రాజధానిని అమరావతి నుంచి మారుస్తూ చట్టసవరణ చేయవచ్చని కూడా సెలవిచ్చారు. అమరావతికి తాను ఏనాడూ వ్యతిరేకం కాదని, అందుకే శాసన రాజధానిగా ఏర్పాటు చేశానని తెలిపారు. అమరావతికి ఏ ఒక్కరూ వ్యతిరేకం కాదని, రాజధాని పేరిట చేస్తున్న అవినీతికే వ్యతిరేకమని చెప్పారు. అమరావతిలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ కంటే తానే ఎక్కువ కాలం కాపురం చేశానని జగన్ చెప్పుకున్నారు. తనకు అమరావతిపై అభిమానం ఉందనేందుకు చంద్రబాబు కంటే ముందుగానే తాడేపల్లిలో సొంత ఇల్లు కట్టుకున్నానని.. ప్రస్తుతం అదే భూమిపై ఉండడమే సాక్ష్యమన్నారు. ఇలా అర్థంపర్థం లేని వ్యాఖ్యలు, వాదనలు జగన్ రాజకీయ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి. అతనిలోని నిరంకుశ విధానాలు బటయకు వస్తున్నాయి. అధికారంలో ఉంటే ఎంతటి విధ్వంసానికి అయినా తెగిస్తారని ప్రజావేదిక కూల్చివేతతో చూపారు. మద్యపాన నిషేధం పేరుతో మద్యంపై దందా చేశారు. ఒక్కటేమిటి సకల వ్యవస్థలను భ్రష్టు పట్టించి, బటన్ నొక్కుడుతో రాష్ట్రాన్ని అధోగతి పాలుచేశారు. అప్పులు చేసి ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారు. విశాఖ భీమిలిలో ప్యాలెస్‌లు కట్టుకుని తన రాజరిక పోకడలను చాటారు. అందుకే ఇప్పుడు జగన్ తననకున్న కాస్తా ఇమేజ్‌ను బజారున పడేసుకున్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును వ్యతిరేకించడం ద్వారా వైసీపీతో పాటు జగన్ జాతీయ రాజకీయాల్లో భ్రష్ట చరిత్రను లిఖించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానికి సంబంధించిన బిల్లును.. వైసీపీ తప్ప అన్ని పార్టీలూ సంపూర్ణంగా సమర్థించాయి. బిల్లును వ్యతిరేకించొద్దు.. మద్దతు ఇవ్వొద్దన్నది తొలుత వైసీపీ తీసుకున్న నిర్ణయం. అయితే కాంగ్రెస్ తెలంగాణ ఎంపీలు సైతం అమరావతికి మద్దతిస్తూ మాట్లాడడంతో వైసీపీ నాయకత్వానికి దిక్కుతోచలేదు. చివరకు వ్యతిరేకిస్తూ ఆ పార్టీ ఎంపీలు వాకౌట్ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబును విమర్శిస్తూ వైసీపీ లోక్‌సభాపక్ష నేత మిథున్‌రెడ్డి చేసిన ప్రసంగాన్ని గానీ.. ఆ పార్టీ ఎంపీల వాకౌట్‌ను గానీ సభలో ఎవరూ పట్టించుకోలేదు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ముగుస్తున్న వేళ, అకస్మాత్తుగా బిల్లును తెరపైకి తేవడం.. దానికి



ముందే అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి పంపాలని స్వయంగా ప్రధాని కార్యాలయం రాష్ట్రప్రభుత్వానికి సూచించడం.. ఆగమేఘాలపై కూటమి ప్రభుత్వం అత్యవసరంగా అసెంబ్లీని సమావేశపరచి తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడం.. శాసనమండలిలో పెట్టనవసరం లేదని తేల్చడం.. ఆ వెంటనే కేంద్రం బిల్లును తీసుకు రావడం.. శరవేగంతో జరిగిన ఈ పరిణామాలతో జగన్ ఉక్కిరిబిక్కిరి అయ్యారని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఓవైపు మతపరమైన, కుటుంబపరమైన వివాదాలు జగన్‌ని చుట్టుముడుతున్న వేళ, ఇప్పుడు అమరావతితో రాజకీయంగా సమాధి తవ్వుకున్నట్లుగానే భావించాలి. వర్తమాన రాజకీయాలలో జగన్ తనవికృత రాజకీయ మేథను ప్రదర్శించి మరొకరు సాటిరారని ప్రచారం చేసుకున్నారు. ఇలాంటి రాజకీయ నేతల వల్ల ప్రజలకు కానీ, రాష్ట్రానికి కానీ మేలు జరగదు. ఫక్తు ఫూడల్ వ్యవస్థకు పునాదిగా జగన్ రాజకీయ ఆలోచనలు అద్దం పడుతున్నాయి.

# నిధుల్లేక నీరసం

## ముందుకు సాగని సాగునీటి ప్రాజెక్టుల పనులు ఐదేళ్లలో కేటాయింపులు ఘనం..ఖర్చు స్వల్పమే

పూర్తి చేస్తామని చెప్పిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక సాగునీటి ప్రాజెక్టులన్నిటినీ అటకెక్కించారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం నుండి కరువు ప్రాంతాలకు జలకళను పంచే హంద్రీనీవా సుజల స్రవంతి, గాలేరు నగరి స్రవంతి, రాయలసీమ ఎత్తిపోతల పథకం, వెలిగొండ ప్రాజెక్టు, పల్నాడు కరువు నివారణ ప్రాజెక్టు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఇలా ప్రతి ప్రాజెక్టు నిర్మాణం ఈ ఐదేళ్లకాలంలో నిధుల్లేక నీరసించిపోయాయి. బడ్జెట్ కేటాయింపుల్లో రూ.61,573 కోట్లు చూపినా.. రూ.33 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు లెక్కలు తెలుపుతున్నాయి. తాము అధికారంలోకి రాగానే పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ ఇచ్చి ప్రాజెక్టును సత్వరం పూర్తి చేస్తామని చెప్పినప్పటికీ చేసింది లేదు. పునరావాసానికి నిధులివ్వలేదు. 2019 నాటికి పూర్తి చేస్తామని టిడిపి ప్రభుత్వం చెబితే, 2021 నాటికి పూర్తి చేస్తామని వైసిపి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటనలు చేసినా.. 2026 నాటికి గానీ మొదటి దశ పనులు పూర్తికావని కేంద్ర ప్రభుత్వం ఏకంగా పార్లమెంటులో ప్రకటన చేసింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పోలవరం ప్రాజెక్టును అటకెక్కించి నట్లే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన ప్రాజెక్టులన్నింటినీ నిలిపేసింది. అలాగే వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి రెండు టన్నెల్ నిర్మాణాలు పూర్తయినా పునరావాసానికి సంబంధించి భూసేకరణ కోసం రూ.1,100 కోట్లు చెల్లించక పోవడంతో నీరు ఎప్పుడు వస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ప్రాజెక్టు పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజె క్టును అటకెక్కించేశారు. హంద్రీనీవా ప్రాజెక్టుకు సంబంధించి రెండో దశ విస్తరణ పనులను ప్రారంభించ కుండా కాంట్రాక్టరు మొండికేశారు. పనులు చేస్తే బిల్లులు రావనే కారణంతో చాలా పనులకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు పనులు చేయని పరిస్థితి వుంది. కొత్త ప్రాజెక్టులను అటకెక్కిం చడమే కాదు..



: రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని ప్రభుత్వం విస్మరించింది. తమ పార్టీ అధికారంలోకి రాగానే ప్రాధాన్యతా క్రమంలో సాగునీటి ప్రాజెక్టులను నిధులివ్వని కేంద్రాన్ని నిలదీసిందీ లేదు. రెండు దశలుగా నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పిన ప్రభుత్వం మొదటి దశకు సంబంధించి 41.15 మీటర్లు వరకూ వుండే పునరావాసానికి కూడా

వున్న ప్రాజెక్టుల నిర్వహణకు నిధులివ్వలేదు. అలాగే పులిచింతల ప్రాజెక్టు, పింఛా డ్యామ్, అన్నమయ్య, గుండ్లకమ్మ తదితర ప్రాజెక్టులు ధ్వంసమయ్యాయి. సాగునీటి ప్రాజెక్టులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# 'కొల్లేరు'పై కల్లబొల్లి మాటలు !

## ప్రజలను మోసగిస్తున్న అధికార, ప్రతిపక్ష పార్టీలు


: కొల్లేరు ప్రజలను మరోసారి మోసగించేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలు సిద్ధమయ్యాయి. ఓట్ల కోసం నిస్సిగ్గుగా మాయమాటలు చెబుతున్నాయి. కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని, అక్కడి ప్రజలను ఆదుకుంటామని చెప్పి మళ్లీ హామీలు గుప్పిస్తున్నాయి. కొల్లేరు ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపకుండా వంచించడంలో ప్రధాన ముద్దాయి బిజెపినే. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న ఆ పార్టీకి కాంటూరు కుదింపు ఏమంత కష్టం కాదు. మాతోనే కొల్లేరు సమస్య పరిష్కారమంటూ కైకలూరు బిజెపి అభ్యర్థి మళ్లీ చెప్తుండడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొల్లేరు ప్రాంతం 77 వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. కొల్లేరులో బెడ్, బెల్ట్ గ్రామాలు 120కుపైగా ఉన్నాయి. ఈ గ్రామాల్లోని లక్షలాది మంది ప్రజలు కొల్లేరుపై ఆధారపడి జీవిస్తున్నారు. కొల్లేరులో సంప్రదాయ పద్ధతిలో రైతులు వరి సాగు చేసేవారు. జలగం వెంగళరావు ప్రభుత్వ హయాంలో కొల్లేరు గ్రామాల్లో సొసైటీలు ఏర్పాటు చేసి భూములను పంపిణీ చేశారు. భూములు చేపల చెరువులకు అనుకూలంగా ఉంటాయంటూ ప్రభుత్వమే బలవంతంగా చేపల చెరువులు తవ్వించింది. అయితే, 2005లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో కొల్లేరులోని చేపల చెరువులన్నింటినీ బాంబులు పెట్టి ధ్వంసం చేశారు. కొల్లేరు భూములనే కాకుండా దాదాపు పది వేల ఎకరాల్లోని పట్టా భూముల్లోని చెరువులను ధ్వంసం చేయడంతో అప్పటి నుంచి కొల్లేరు ప్రజల బతుకులు దుర్భరంగా మారాయి. ఉపాధి లేక కర్ణాటక, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలకు వలస వెళ్లి బతుకులు నెట్టుకొస్తున్నారు. రాష్ట్ర విభజన తర్వాత 2014లో టిడిపి, బిజెపి కలిసి ఎన్నికల్లో పోటీ చేశాయి. భీమవరంలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని అభ్యర్థిగా ఉన్న మోడీ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని హామీ ఇచ్చారు. దీంతో, కైకలూరు ఎమ్మెల్యేగా బిజెపి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌ను ప్రజలు గెలిపించారు. సర్వేల పేరుతో హడావుడి చేయడం తప్ప, కొల్లేరు ప్రజలకిచ్చిన మాటను నిలుపుకోలేదు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలంటూ అసెంబ్లీలో తీర్మానం చేసి రాష్ట్రంలోని టిడిపి, బిజెపి ప్రభుత్వం అప్పట్లో చేతులు దులుపుకుంది. ధ్వంసం చేసిన పట్టా భూములను రైతులకు అప్పగించలేదు. అధికారులు, రాజకీయ నాయకుల చుట్టూ తిరుగుతున్నా బాధిత ప్రజలకు నేటికీ న్యాయం జరగలేదు.

### ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో వైసిపి వెన్నుపోటు !

2019 ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే కొల్లేరు ప్రజలకు న్యాయం చేస్తామంటూ వైసిపి హామీ ఇచ్చింది. అయితే, అధికారంలోకి వచ్చాక మూడో కాంటూరు కుదింపుపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేలేకపోయింది. కొల్లేరును పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీనీ గాలికొదిలేసింది. మూడో కాంటూరుకు కుదింపును పక్కనపెట్టి ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో కొల్లేరు ప్రజలకు వెన్నుపోటు పొడిచేందుకు సిద్ధమైంది. కొల్లేరును పదో కాంటూరు వరకూ విస్తరించేందుకు ఏరియల్ సర్వే నిర్వహించడంతోపాటు మండల కేంద్రాల్లో ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసింది. దాదాపు మరో 80కుపైగా గ్రామాలను ఎకోసెన్సిటివ్ జోన్‌లోకి చేర్చేందుకు ప్రణాళికలు రూపొందించింది. ప్రజలు వ్యతిరేకిస్తున్నా పట్టించుకోలేదు.


### మళ్లీ ఓట్ల కోసం మోసపూరిత మాటలు

ప్రస్తుత ఎన్నికల్లో టిడిపి, బిజెపి, జనసేన కూటమిగా ఏర్పడి పోటీ చేస్తున్నాయి. పొత్తులో భాగంగా కైకలూరులో బిజెపి పోటీ చేస్తోంది. 2014లో గెలుపొందిన కామినేని శ్రీనివాస్‌కే మరోసారి టికెట్ దక్కింది. అప్పుడు ఐదేళ్లపాటు కొల్లేరు ప్రజలను మోసగించిన బిజెపి అభ్యర్థి%ా% కొల్లేరు సమస్య మాతోనే పరిష్కారమంటూ ఇప్పుడు మళ్లీ కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారు. వైసిపి, టిడిపి కూడా కొల్లేరు ప్రజలను మరోసారి మాటమాటలతో మభ్యపెట్టాలని చూస్తున్నాయి. ఈ పార్టీల తీరును నిశితంగా గమనిస్తున్న కొల్లేరు ప్రజలు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తామని అంటున్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

## ఆట



# రిటైర్‌మెంట్‌పై ఊహాగానాలకు మహ్మద్ షమీ చెక్

సీనియర్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీకి టీమిండియాలోకి దారులన్నీ దాదాపు క్లోజ్ అయిన విషయం తెలిసిందే. వయసు ప్రభావం, ఫిట్‌నెస్ సమస్యలను కారణంగా చూపుతూ.. సెలెక్షన్ కమిటీ షమీ పేరును పరిగణలోకి తీసుకోవట్లేదు. దీంతో దేశవాళీలో సత్తా చాటుతున్నా.. షమీకి మాత్రం పిలుపురావడం లేదు. గతంలో టెస్టులు, వన్డేలు, టీ20 ఇలా మూడు ఫార్మాట్లలోనూ అదరగొట్టిన షమీని మళ్లీ టీమ్‌లోకి తీసుకోవాలని.. అతని అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని మాజీలు కూడా సూచించారు. షమీ తన చివరి వన్డే.. 2025 మార్చి 9న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో ఆడాడు. చివరి టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ను 2025 ఫిబ్రవరి 2న ముంబైలో ఇంగ్లాండ్‌పై ఆడాడు. ఇక టెస్టు క్రికెట్ ఆడి మూడేళ్లకుపైనే అయింది. ఈ నేపథ్యంలోనే షమీ రిటైర్‌మెంట్ విషయంపై క్లారిటీ ఇచ్చేశాడు.'ది శుభంకర్ మిశ్రా షో' మహ్మద్ షమీ మాట్లాడుతూ.. తాను అలసిపోయినప్పుడు క్రికెట్ వీడ్కోలు పలుకుతానని.. ప్రస్తుతానికి రిటైర్‌మెంట్ గురించి ఆలోచించడం లేదని స్పష్టం చేశాడు. రిటైర్‌మెంట్ ఆలోచన మనల్ని మరింత వెనక్కి లాగుతుందని.. ఆ ఆలోచన వస్తే అప్పటికే అలసిపోయారని అర్థమన్నారు. ఏ రోజు ఉదయాన్ని తాను నిద్రలేచిన తరువాత విసుగు పుడుతుందో.. అదే రోజు ఆటకు గుడ్ బై చెబుతానని అన్నాడు. బద్ధకం వచ్చినా.. విసుగు పుట్టినా.. అలసిపోయినా రిటైర్‌మెంట్ ప్రకటిస్తానని వెల్లడించాడు. ప్రస్తుతం తనకు బద్ధకం లేదని.. ఆటను ఆస్వాదిస్తున్నానని చెప్పుకొచ్చాడు షమీ. ఒక బౌలర్‌గా తాను వందశాతం తన బాధ్యతలు నెరవేరుస్తానని.. తనపై ఉంచిన అంచనాలకు అనుగుణంగా రాణిస్తానని అన్నాడు. గత సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడిన షమీ.. ఈసారి లక్నో సూపర్ జెయింట్స్ టీమ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. షమీపై ా=ఎ టీమ్ భారీ అంచనాలు పెట్టుకోగా.. ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. ఐపీఎల్ మినీ వేలానికి ముందు గుజరాత్ టైటాన్స్ టీమ్‌తో ట్రేడ్ డీల్ చేసుకుంది. లక్నో తరఫున దుమ్ములేపి.. టీమిండియా జెర్సీలో షమీని మళ్లీ చూడాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

# కావ్య మారన్‌కు పోటీగా అనన్యా బిర్లా



ఐపీఎల్ అంటే కేవలం సిక్సర్లు, ఫోర్ల వర్షమే కాదు.. గ్లామర్ హంగామా కూడా. ప్రతి సీజన్‌లో మైదానంలో ఆటగాళ్లు ఎంతగా అలరిస్తారో, గ్యాలరీలో ఉండే ఫ్రాంచైజీ ఓనర్లు అంతకంటే ఎక్కువ క్రేజ్ సంపాదించుకుంటారు. ఇప్పటివరకు ఐపీఎల్ అనగానే అందరికీ గుర్తొచ్చేది సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈఓ కావ్య మారన్. ఆమె ఇచ్చే ఎక్స్‌ప్రెషన్స్‌కు మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అయితే 2026 సీజన్‌లో ఈ బ్యూటీ వార్ సరికొత్త మలుపు తిరిగింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టును ఆదిత్య బిర్లా గ్రూప్ కళ్లు చెదిరే ధరకు దక్కించుకోవడంతో, ఆ జట్టు ముఖచిత్రంగా అనన్యా బిర్లా ఎంట్రీ ఇచ్చారు. ప్రముఖ పారిశ్రామికవేత్త కుమార మంగళం బిర్లా కుమార్తె అనన్యా బిర్లా ఆర్‌సీబీ మేనేజ్‌మెంట్‌లో చేరడం లీగ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఆదిత్య బిర్లా గ్రూప్ ఏకంగా రూ. 16,706 కోట్లతో ఈ జట్టును దక్కించుకోవడంతో అనన్య ఇప్పుడు ఆర్‌సీబీకి ప్రధాన ఆకర్షణగా నిలిచారు. ఆమె రాకతో సోషల్ మీడియాలో అనన్య ఫాలోవర్ల సంఖ్య ఒక్కసారిగా 4 లక్షల నుంచి 2 మిలియన్లకు పైగా పెరిగిపోయింది. నెటిజన్లు ఆమెను 'నేషనల్ క్రష్' అని, ఆర్‌సీబీకి దొరికిన 'లక్కీ చార్మ్' అని కొనియాడుతున్నారు. ఆమె ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి.మరోవైపు సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓనర్ కావ్య మారన్ క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. గత కొన్నేళ్లుగా ఐపీఎల్‌లో మోస్ట్ పాపులర్ లేడీ ఓనర్‌గా ఆమె కొనసాగుతున్నారు. వేలంలో ఆమె చేసే హడావుడి, గ్రౌండ్‌లో టీమ్ గెలిచినప్పుడు ఇచ్చే చిరునవ్వుకు ఫిదా కాని వారుండరు. ఇప్పుడు అనన్యా బిర్లా గట్టి పోటీ ఇస్తున్నా, సన్‌రైజర్స్ ఫ్యాన్స్ మాత్రం "ఎవరు వచ్చినా కావ్య మారన్ స్థానం వేరు" అంటూ సోషల్ మీడియాలో గట్టిగా వాదిస్తున్నారు. కావ్యానే ఐపీఎల్ రియల్ క్వీన్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. మార్చి 28న జరిగిన ఆర్‌సీబీ వర్సెస్ ఎస్ఆర్‌హెచ్ ఓపెనింగ్ మ్యాచ్‌లో ఆట కంటే కూడా అనన్య, కావ్యల మీదనే కెమెరాలు ఎక్కువగా ఫోకస్ చేశాయి. దీంతో ఎక్స్ (ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్‌లో వీరిద్దరిపై మీమ్స్, ఎడిట్స్ వైరల్ అవుతున్నాయి. "ఐపీఎల్ డాటర్స్" అలాగే "ఎవరి వైపు ఎక్కువ కెమెరాలు తిరుగుతాయి?" అనే హ్యాష్ ట్యాగ్‌లు ట్రెండ్ అవుతున్నాయి. అనన్యను 'న్యూ కావ్య మారన్' అని కొందరు అంటుంటే, ఎస్ఆర్‌హెచ్ ఫ్యాన్స్ మాత్రం కావ్యానే సీనియర్ అని, ఆమె ఇన్వాల్వ్‌మెంట్ వేరని వెనకేసుకొస్తున్నారు.అనన్యా బిర్లా ఫ్యామిలీ సపోర్ట్ వల్ల హైలెట్ అయిన అమ్మాయి కాదు. ఆమె కూడా తనకంటూ ఒక ప్రత్యేకమైన క్రేజ్ అందుకుంటున్నారు. వ్యాపారవేత్త అలాగే ఇంటర్నేషనల్ పాప్ సింగర్ కూడా. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో చదువుకున్న ఆమె, 17 ఏళ్ల వయసులోనే 'స్వతంత్ర మైక్రోఫిన్' సంస్థను స్థాపించి సక్సెస్ అయ్యారు. సంగీత రంగంలో కూడా ఆమెకు గొప్ప పేరుంది. ఆమె పాడిన ఇంగ్లీష్ సాంగ్స్ ప్లాటినం సర్టిఫికేషన్ కూడా పొందాయి. ఇప్పుడు క్రికెట్ రంగంలోకి అడుగుపెట్టడం ఆమె కెరీర్‌లో మరో పెద్ద మలుపు.డబ్బు పరంగా చూస్తే అనన్యా బిర్లా, కావ్య మారన్ కంటే చాలా ముందున్నారు. బిర్లా కుటుంబానికి సుమారు 19.1 బిలియన్ డాలర్ల ఆస్తులు ఉంటే, మారన్ కుటుంబానికి 2.57 బిలియన్ డాలర్ల ఆస్తులు ఉన్నాయి. వ్యక్తిగత ఆస్తుల పరంగా కూడా అనన్యదే పైచేయి. అయితే ఐపీఎల్ మేనేజ్‌మెంట్ క్రికెట్ ఆపరేషన్స్‌లో కావ్యకు ఎక్కువ అనుభవం ఉంది. సన్‌రైజర్స్ ఈస్టన్ కేప్ వంటి ఇతర దేశాల లీగ్ జట్లను కూడా ఆమె విజయవంతంగా నడిపిస్తున్నారు. ఇప్పుడు అనన్య కూడా అదే స్థాయిలో ఆర్‌సీబీని నడిపిస్తారో లేదో చూడాలి. గతంలో ఐపీఎల్ అనగానే నీతా అంబానీ, ప్రీతి జింటా, జూహీ చావ్లా పేర్లు వినిపించేవి. వారి నాయకత్వంలో ఆయా జట్లు ఎన్నో విజయాలు సాధించాయి. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. యువతరం ప్రతినిధులుగా కావ్య మారన్, అనన్యా బిర్లా సోషల్ మీడియాలో ఎక్కువగా వైరల్ అవుతున్నారు. వీరు కేవలం ఓనర్లుగానే కాకుండా, సోషల్ మీడియా ఐకాన్స్‌గా మారిపోయారు. గ్లామర్ బిజినెస్ వ్యూహాలను కలగలిపి ఐపీఎల్‌ను మరో స్థాయికి తీసుకెళ్తున్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

## సినిమా
CINEMA



# రామాయణ టీజర్ 2న విడుదల

బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్ ప్రధాన పాత్రలో ప్రముఖ దర్శకుడు నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణ'. దాదాపు రూ.3000 కోట్ల బ్జడెట్‌తో రాబోతున్న ఈ చిత్రం దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ఈ సినిమా టీజర్‌కు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ క్లియరెన్స్ ఇచ్చింది. ఈ చిత్రం నుంచి 'రామ' పేరుతో రాబోతున్న ఈ టీజర్ విడుదలకు ముందు సెన్సార్ బోర్డు నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో ఏప్రిల్ 2న టీజర్ విడుదల చేయడానికి మార్గం సుగమమైంది. దీనితో పాటు ఈ టీజర్ నిడివికి సంబంధించిన వివరాలు కూడా వెల్లడయ్యాయి. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, 'రామ' టీజర్ రన్‌టైమ్ 2 నిమిషాల 38 సెకన్లుగా ఉంది. ఈ టీజర్‌కు సెన్సార్ బోర్డు యూనివర్సల్ రేటింగ్ ఇచ్చింది, దీంతో ఈ టీజర్‌ను అన్ని వయసుల వారు థియేటర్‌లలో వీక్షించవచ్చు. ఇప్పటివరకు చిత్రబృందం కేవలం టైటిల్ వీడియోతో పాటు 3 నిమిషాల 3 సెకన్ల నిడివి గల 'రామాయణ: ది ఇంట్రడక్షన్' అనే క్లిప్‌ను మాత్రమే పంచుకుంది. భారీ వీఎఫ్ఎక్స్ హంగులతో కూడిన ఆ వీడియోలో శ్రీరాముడిగా రణబీర్ కపూర్, రావణుడిగా కన్నడ స్టార్ యష్ లుక్‌లకు సంబంధించిన ఫస్ట్ లుక్‌లను చూపించారు.అయితే ఇప్పుడు రాబోతున్న టీజర్ ఎలా ఉండబోతుందని అందరూ ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. ఇక ఈ దృశ్యకావ్యం 2026 నవంబర్‌లో దీపావళి కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




# ఓటిటిలోకి రాధిక తాయ్ కిళవి మూవీ

సీనియర్ నటి రాధికా శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటించి, సంచలన విజయం సాధించిన తమిళ చిత్రం 'తాయ్ కిళవి'. ఈ చిత్రం తాజాగా డిజిటల్ ప్రియులను అలరించేందుకు సిద్ధమైంది. కేవలం రూ.9 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిన్న సినిమా బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ.75 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు ఈ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ డేట్ ఖరారైంది. ఏప్రిల్ 10 నుంచి ఈ చిత్రం 'జియో హాట్‌స్టార్' తో పాటు సింప్లీ సౌత్ అనే ఓటీటీలో ఒకేసారి స్ట్రీమింగ్ కాబోతున్నాయి. తమిళంతో పాటు తెలుగులోనూ ఈ చిత్రం డిజిటల్ ప్రేక్షకులకు అందుబాటులోకి రాబోతుంది. శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహించిన ఈ కామెడీ డ్రామాను ప్రముఖ తమిళ హీరో శివకార్తికేయన్ తన సొంత నిర్మాణ సంస్థ 'శివకార్తికేయన్ ప్రొడక్షన్స్' పతాకంపై నిర్మించారు. 63 ఏళ్ల వయసులో రాధిక దాదాపు 5 గంటల పాటు ప్రోస్థటిక్ మేకప్ వేసుకుని మరీ పవునుత్తాయి అనే వృద్ధురాలి పాత్రలో అద్భుతమైన నటనను కనబరిచారు. ఈ సినిమా కథవిషయానికి వస్తే.. పల్లెటూరి నేపథ్యంలో సాగే ఈ కథలో పవునుత్తాయి (రాధికా శరత్‌కుమార్) ఒక కఠినమైన వడ్డీ వ్యాపారి. అయితే ఊహించని విధంగా ఆమె పక్షవాతానికి గురై మంచాన పడుతుంది. ఆమె వద్ద 160 తులాల బంగారం ఉందనే వార్త తెలుసుకున్న ఆమె ముగ్గురు కొడుకులు వేర్వేరు ప్రాంతాల నుంచి హుటాహుటిన ఊరికి చేరుకుంటారు. ఆ బంగారాన్ని దక్కించుకోవడానికి వారు చేసిన ప్రయత్నాలు, వాటి వల్ల వచ్చే కామెడీ మరియు ఎమోషన్స్‌తో ఈ సినిమా సాగుతుంది.



# విమర్శలను పట్టించుకోవడం మానేశా

తాను ఏం చేసినా కొందరు విమర్శిస్తూనే ఉన్నారని, అందుకే అలాంటివారిని పట్టించుకోవడం మానేసినట్లు నిర్మాత నిహారిక చెప్పారు. ఆమె సొంత బ్యానర్‌పై వస్తోన్న చిత్రం 'రాకాస' సంగీత్ శోభన్, నయన్ సారిక ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు మానస శర్మ దర్శకురాలు. ఈ మూవీ ఏప్రిల్ 3న విడుదల కానుంది. ఈ సందర్భంగా టీమ్ ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. అందులో నిహారిక మాట్లాడుతూ.. నిర్మాతగా కెరీర్ ప్రారంభించగానే ఎన్నో విమర్శలు ఎదురయ్యాయని అన్నారు. కమిటీ కుర్రోళ్లుతో 11 మంది కొత్త వాళ్లను పరిచయం చేశాను. అప్పుడు చాలామంది కామెంట్స్ చేశారు. ఎందుకు చేస్తున్నావు ఇదంతా.. తెలిసిన వాళ్లతో సినిమాలు చేయచ్చు కదా అన్నారు. ఇప్పుడు 'రాకాస' చేస్తుంటే 'కమిటీ కుర్రోళ్లు' లాంటి కథలు చేయచ్చు కదా.. ఇలాంటి వీఎఫ్ఎక్స్‌లు ఎందుకు అన్నారు. చిన్నచిన్న వాళ్లతో సినిమాలు చేయచ్చు కదా అని మరికొందరు అన్నారు. నేనేం చేసినా మాటలు అనేవాళ్లు అంటూనే ఉన్నారు. అందుకే నేను చేయాలనుకున్నది చేస్తూనే ఉంటాను. నిర్మాతగా ప్రతి సినిమా నుంచి నేర్చుకుంటూనే ఉన్నాను. కొణిదెల కుటుంబం నాకు ఎంత ముఖ్యమో నా బ్యానర్ పింక్ ఎలిఫెంట్ ఫ్యామిలీ కూడా అంతే ముఖ్యం అని నిహారిక అన్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# సంస్థాన్ నారాయణపురంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**అక్షరకలం చౌటుప్పల్**



మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. స్థానిక సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి, డిసిసి ప్రధాన కార్యదర్శి గుత్త ఉమా ప్రేమ్ చందర్ రెడ్డి చేతుల మీదుగా ఈ చెక్కులను అందజేశారు. మొత్తం 17 మంది లబ్ధిదారులకు వివిధ మొత్తాల్లో చెక్కులను పంపిణీ చేశారు. బద్దం వంశీ 60,000 జక్కిడి సత్తెమ్మ 60,000 నూకం గాలయ్య 60,000, ఉప్పర మౌని కృష్ణ 60,000, ఏనుగు లాలయ్య 60,000,వినుకొండ భీష్మాచారి 52,500,దాచేపల్లి భారతమ్మ 44,000, మేకల శంకరయ్య 31,000 దుర్గం లింగస్వామి 25,000,వందనపు కరుణ శ్రీ 28,000,వందనపు రమేష్ బాబు 16,000 కరంటోతు శ్రీకాంత్ 36,000,నేర్లకంటి లక్ష్మమ్మ 20,000,బద్దం యాదగిరి18,000, చిలువేరు శివకుమార్ 24,000,ఏపూరి ముత్తమ్మ 17,000 సంగిశెట్టి తిరుమలేష్ 9000 వేల రూపాయల చెక్కులను పొందారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ,ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు జక్కిడి చంద్రారెడ్డి,వార్డు మెంబర్లు సూరపల్లి వెంకటేష్,మందుగుల బాలకృష్ణ,పందుల యాదగిరి గౌడ్,చిలివేరు రమాదేవి శంకర్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిలువేరు పాల అంజయ్య,రహీం షరీఫ్,పిఏసిఎస్ మాజీ డైరెక్టర్ ఉప్పల కృష్ణ,బద్దం గిరి,మహమ్మద్ అర్షద్, బానోతు కిరణ్,బద్దుల యాదగిరి,తదితరులు పాల్గొన్నారు.

# వీరయోధుడు దొడ్డి కొమురయ్యకు ఘన నివాళులు



**అక్షరకలం నల్లగొండ**

తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు, వీరయోధుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు నల్లగొండ జిల్లా కేంద్రంలో అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా జిల్లా యాదవ ఉద్యోగుల సంఘం, టీఎన్జీవో నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యాదవ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తరాల పరమేశ్ యాదవ్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాగెల్లి మురళి, ప్రధాన కార్యదర్శి జె. శేఖర్ రెడ్డి ప్రసంగించారు. వారు మాట్లాడుతూ, దొడ్డి కొమురయ్య త్యాగం కేవలం ఒక వ్యక్తి పోరాటం కాదని, అది తెలంగాణ ప్రజల్లో స్వేచ్ఛా కాంక్షను, సమానత్వ పోరాట స్ఫూర్తిని రగిలించిన అగ్నికణమని కొనియాడారు. నైజాం నిరంకుశత్వానికి, దేశ్‌ముఖ్‌ల అరాచకానికి వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం ప్రజాస్వామ్య తెలంగాణకు పునాది వేసింది. 1946 జూలై 4న జరిగిన చారిత్రాత్మక ఘటనను నాయకులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. విసునూరు రామచంద్రారెడ్డి అనుచరులు (రౌడీ మూకలు) ప్రజలపై జరిపిన దాడులను అడ్డుకోవడంలో కొమురయ్య ముందున్నారు. కేవలం కర్రలు, బడిశెలు, గునపాలతో నిరంకుశ శక్తులను తరిమికొట్టే క్రమంలో ఆయన అమరుడయ్యారు. ఆయన మరణం జనగామ ప్రాంతంతో పాటు ఆంధ్ర మహాసభ కార్యకర్తలలో విప్లవ చైతన్యాన్ని నింపి, సాయుధ పోరాటానికి నాంది పలికింది. ఈ నివాళులర్పించిన వారిలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సంజీవయ్యతో పాటు పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు. ?వార్డెన్స్ అసోసియేషన్ నాయకులు జిల్లా అధ్యక్షుడు రణదీవె, యాదవ ఉద్యోగుల సంఘం నాయకులు కదారి యాదయ్య, చింతకాయల రామచంద్రు, తరాల జగదీష్, అల్లి సతీష్, రాయనబోయిన రాంబాబు, బారి శ్రీనివాస్, టీఎన్జీవోస్ నాయకులు సత్యనారాయణ, సుమన్, కవిత, జ్యోతి పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య జీవితం నేటి తరానికి ఆదర్శం కావాలి





**అక్షర కలం బీబీనగర్**

తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శం కావాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగల్ రెడ్డి అన్నారు. శుక్రవారం దొడ్డి కొమురయ్య 99వ జయంతి సందర్భంగా బీబీనగర్ మండల కేంద్రంలోని కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య సేవలను, రైతాంగ పోరాట వీరయోధుని త్యాగాలను గుర్తుచేసుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల కోఆప్షన్ సభ్యులు ఎండీ .అక్బరు, బీబీనగర్ సర్పంచ్ పంజాల శ్రీనివాస్ గౌడ్ , మండల పార్టీ అద్యక్షులు సురకంటి సత్తి రెడ్డి , మాజీ ఎంపిటీసీ గోలి నరేందర్ రెడ్డి , ఉపసర్పంచి గోలి నరసింహా రెడ్డి మంగలిగేష్ , వార్డు సభ్యులు , సోమ శివ కుమార్ , సోమ గొపాల్ , సోమ సురేష్ , సోమ ముత్యాలు , గొర్ల మేకల పెంపకందారుల సంగం అద్యక్షులు సోము రమేశ్ , బండారి బాలయ్య, బీబీనగర్ లైన్ మెయిన్ బాలనరసింహ ,దవ్వడి శ్రీశైలం , దవాడి శంకర్ , మంగ శ్రీశైలం ,సోమ బలరాజు తదితరులు పాల్గొన్నారు.

# తాటికోల్‌లో అనారోగ్యంతో ఉన్న మణెమ్మను పరామర్శించిన రవీంద్ర కుమార్

**అక్షరకలం దేవరకొండ**



దేవరకొండ మండలం తాటికోల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బొడ్డు లక్ష్మయ్య భార్య బొడ్డు మణెమ్మను శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పరామర్శించారు.గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన మణెమ్మ, ప్రస్తుతం కోలుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న రవీంద్ర కుమార్ వారి నివాసానికి చేరుకుని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణెమ్మ త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బొడ్డు గోపాల్ గౌడ్, బొడ్డుపల్లి కృష్ణ, రమావత్ తులిసీరామ్, వడత్య బాలు, సయ్యద్, గోపి తదితరులు పాల్గొన్నారు.


# నల్గొండలో భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

## సిలువ మోస్తూ క్రైస్తవుల ఊరేగింపు





క్రీస్తు శ్రమలను స్మరిస్తూ నల్గొండ పట్టణ కేంద్రంలో గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవ సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని మరియారాణి కేథడ్రల్ చర్చి నుండి క్రైస్తవులు సిలువను మోస్తూ భారీ ఊరేగింపుగా బయలుదేరారు.?యేసుక్రీస్తు పడిన శ్రమలను





గుర్తుచేసుకుంటూ, భక్తులు భక్తిపాటలు పాడుతూ సాగారు. అనంతరం ఈ ఊరేగింపు పట్టణ శివార్లలోని మర్యాగిరి పుణ్యక్షేత్రం వద్దకు చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థన సమావేశంలో బిషప్ ధమన్ కుమార్ వాక్యోపదేశం చేశారు. ఈ సందర్భంగా బిషప్ ధమన్ కుమార్ మాట్లాడుతూ.. లోక రక్షణ కోసం తనను తాను త్యాగం చేసిన యేసుక్రీస్తు మార్గం అనుసరణీయమని, ప్రతి ఒక్కరూ క్షమాగుణాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేషన్ వైస్ చైర్మన్, పలువురు కార్పొరేటర్లు,బిషప్ దమన్ కుమార్, విచారూ గురువు బాలస్వామి, కౌన్సిల్ మెంబర్స్‌దాసరి శౌరిరాజు, శౌరిరెడ్డి, పి . బాలస్వామి ఎం. ప్రేమ్ కుమార్ నామ మరయ్య, శౌరయ్యజి. మర్రెడ్డి, రజనికాంత్ పాల్గొన్నారు.

కారింగు శ్రీనివాస్ గౌడ్ (అక్షరకలం నల్గొండ )

## కవితకు నూతన పార్టీకి శుభాకాంక్షలు




**అక్షర కలం. : చిట్యాల**

తెలంగాణ జాగృతి కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. జాగృతి అధ్యక్షురాలు శ్రీమతి కవితక్క అధ్యక్షతన ఈ నెల 25వ తేదీన జరగనున్న నూతన రాజకీయ పార్టీ ఆవిర్భావం సందర్భంగా ఈ కీలక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ?ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానం మేరకు తెలంగాణ జాగృతి నకిరేకల్ నియోజకవర్గ ఇంచార్జ్, వండర్ బుక్ రికార్డ్ హోల్డర్ డాక్టర్ టి.జి. లింగం గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కవితను కలిసి, రాబోయే నూతన రాజకీయ పార్టీకి తన పూర్తి మద్దతును ప్రకటిస్తూ ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ కో-కన్వీనర్ బలికె నిరంజన్, పవన్, తారక్ రామ్ ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## చిట్యాలలో మొబైల్ దొంగలను పట్టుకున్న స్థానికులు

**పోలీసులకు అప్పగించిన స్థానికులు**

**అక్షర కలం : చిట్యాల**

నల్గొండ జిల్లా చిట్యాల మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో గత వారం రోజులుగా వరుస మొబైల్ దొంగతనాలతో హడలెత్తిస్తున్న ముఠా ఎట్టకేలకు చిక్కింది. స్థానికుల అప్రమత్తతతో ఇద్దరు దొంగలు స్థానికులకు పట్టుబడగా, మరొకరు పరారైనట్లు సమాచారం. ?గత కొన్ని రోజులుగా చిట్యాల మండలంలో గుర్తుతెలియని వ్యక్తులు మొబైల్ ఫోన్లను యధేచ్ఛగా దొంగిలిస్తున్నారు. ఈ క్రమంలోనే గత నెల మార్చి 30వ తేదీన బాధితులు చిట్యాల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తుండగానే, సదరు ముఠా మరోమారు చోరీలకు తెగబడింది. ?మరోసారి చిట్యాలలో ఓ ప్రయాణికుడు బస్సు ఎక్కుతున్న క్రమంలో దొంగతనానికి పాల్పడుతుండగా అనుమానం వచ్చిన స్థానికులు చాకచక్యంగా వ్యవహరించి ముఠా సభ్యులను పట్టుకున్నారు. వెంటనే చిట్యాల పోలీసులకు సమాచారం అందించగా, ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులకు నిందితులను అప్పగించారు. ?ప్రస్తుతం అదుపులో ఉన్న నిందితులను పోలీసులు విచారిస్తున్నారు. వీరు కేవలం చిట్యాల మండలంలోనే కాకుండా జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా దొంగతనాలకు పాల్పడ్డారా? ఈ ముఠా వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు జరుపుతున్నట్టు ప్రాథమిక సమాచారం..




## వ్యవసాయ కార్మికులను విస్మరించడం తగదు : తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

**అక్షర కలం : చిట్యాల**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవసాయ కార్మికులకు ఇస్తామన్న “ఆత్మీయ భరోసా” పథకాన్ని తక్షణమే అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం చిట్యాల మండలం గుండ్రంపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి, కార్మికులతో



మాట్లాడారు. ?హామీలు ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోటి ఆశలతో తమను గెలిపించిన వ్యవసాయ కార్మికులను విస్మరిస్తున్నారని విమర్శించారు. ?ఏటా 12,000 రూపాయలు ఆత్మీయ భరోసా ఇస్తామని చెప్పి రెండు ఏళ్లు గడుస్తున్నా అతీగతి లేదని మండిపడ్డారు. ?పేద, మధ్యతరగతి కార్మికుల పట్ల ముఖ్యమంత్రి చూపిస్తున్న నిర్లక్ష్య ధోరణి సరైంది కాదని హితవు పలికారు.? కార్మికుల కష్టానికి తగ్గ ఫలితం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రభుత్వం ముందు పలు డిమాండ్లు చేశారు. ఉపాధి హామీ కార్మికులకు రోజుకు 500 రూపాయలు చెల్లించాలి అని కోరారు. 50 ఏళ్లు నిండిన వ్యవసాయ కార్మికులకు నెలకు రూ. 3,000 పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలి అని డిమాండ్ చేశారు.

### నూతన కమిటీ ఎన్నిక

గుండ్రంపల్లి గ్రామ వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీని 11 మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారిలో అధ్యక్షులుగా అంతటి రాధ, ఉపాధ్యక్షులు కొంతం మనమ్మ, ?కార్యదర్శిగా జవ్వాజి అలివేలు, సహాయ కార్యదర్శిగా మారగొని విజయ, కోశాధికారిగా కాసర్ల ముత్తయ్య, ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కత్తుల లింగస్వామి, నాయకులు కాసర్ల ముత్తయ్య, అంతటి రాధ, కొంతం మనమ్మ, కంకల సరిత, మస్కు యాదమ్మ, అచ్చిన ఐలమ్మ, గోపగోని హేమలత, కుంభం సుజాత తదితరులు పాల్గొన్నారు..

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# గోధుమల పంపిణీ హైదరాబాద్‌కే పరిమితం చేయడం అన్యాయం: కాసాల వెంకట్ రెడ్డి



**అక్షరకలం, చండూరు**

రేషన్ కార్డు కలిగివున్న రాష్ట్ర పేద ప్రజలందరికీ గోధుమలు పంపిణీ చేయకుండా గత టిఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించి కేవలం హైదరాబాద్ పరిధికి మాత్రమే గోధుమలు పంపిణీ చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం సైతం గడిచిన రెండున్నర సంవత్సరాలుగా గత ప్రభుత్వ విధానాన్ని అవలంబిస్తూ హైదరాబాద్ ప్రజలకు మాత్రమే గోధుమలు పంపిణీ చేస్తుందని ఇది సమంజసం కాదని నల్గొండ జిల్లా మాజీ ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు , బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కాసాల వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం చండూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతినెల, ప్రతి కార్డుపై అందించేటి సబ్సిడీ గోధుమలను రాష్ట్రమంతటా సప్లై చేయలేని దుస్థితిలో ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం మేరకు బియ్యం తో పాటుగా గోధుమలు, చక్కర, చింతపండు, కారం, పసుపు, ఉప్పు, వంటనూనె, కందిపప్పు వంటి 9 రకాల వంట సరుకులు పట్నం, పల్లె అనే తేడా లేకుండా అర్హులైన పేదలందరికీ ఇవ్వాలన్నారు.

# భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు..

సిలువ త్యాగాన్ని స్మరించుకున్న క్రైస్తవ సోదరులు..




**అక్షర కలం నాగార్జునసాగర్ / నందికొండ**

నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని పరిశుద్ధ లూథరన్ సంఘం ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. లోకరక్షకుడైన యేసుక్రీస్తు మానవాళి పాప విమోచనార్థం సిలువపై ప్రాణత్యాగం చేసిన రోజైన గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని నిర్వహించిన శిలువ ధ్యాన కార్యక్రమం భక్తుల మధ్య ఆధ్యాత్మిక వాతావరణంలో సాగింది.సంఘ కాపరి పి.రమేష్ బాబు నేతృత్వంలో ఈ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు,ఉదయం నుంచే చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు,ఆరాధన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.డాక్టర్ కె. చార్లెస్ వెస్లీ అధ్యక్ష స్థానంలో ఉండి కార్యక్రమాన్ని నడిపించారు,శోభా ప్రభాకర్ ప్రారంభ ప్రార్థనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సంఘ సభ్యులు ఆలపించిన భక్తి కీర్తనలు అలరించాయి,యేసుప్రభువు సిలువపై పలికిన చివరి ఏడు మాటల ప్రాముఖ్యతను ఈ సందర్భంగా భక్తులకు వివరించారు.ఈ ఏడు మాటలపై జరిగిన ధ్యాన ప్రసంగాలు విశ్వాసులలో ఆధ్యాత్మిక పరిణతిని నింపాయి.పలువురు భక్తులు ఈ సందర్భంగా ప్రత్యేక సందేశాలను అందించారు.యేసుప్రభువు త్యాగాన్ని స్మరిస్తూ,ప్రత్యేక ప్రార్థనలతో హిల్ కాలనీ ప్రాంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.కార్యక్రమం విజయవంతం కావడానికి సంఘ సభ్యులు ప్రత్యేక కృషి చేశారు.ఈ కార్యక్రమంలో అడ్మి న్,డి కోటేశ్వరరావు,సంఘ ట్రెజరిస్,జీవన్ బాబు,జాకోబ్ రావు సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య 99వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ



**అక్షర కలం**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య 99వ జయంతి వేడుకలను హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి లో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప్పలపాడు సర్పంచ్ చిన్నం బీరప్ప, ఆత్మకూర్ ఉపసర్పంచ్ మజ్జిగ నరేష్, మజ్జిగ రాంబాబు, కేమిడి రమేష్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి దొడ్డి కొమురయ్య చేసిన త్యాగాలను స్మరించుకుంటూ నాయకులు వారికి ఘన నివాళులు అర్పించారు.

# గ్రామంలో ప్రజాపాన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం!

**(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఏప్రిల్ 03)**

నారాయణపేట జిల్లా మరికల్ మండలం పసుపుల గ్రామంలో ప్రజాపాన ప్రగతి ప్రణాళిక (పీపీపీ) కార్యక్రమంలో గ్రామసభ విజయవంతంగా జరిగింది. ఈ సభలో గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రధాన ప్రణాళికలు, బడ్జెట్ విషయాలు చర్చించబడ్డాయి.
సర్పంచ్ నర్మద రవికుమార్ గౌడ్ ఈ సభకు అధ్యక్షత వహించారు. ఉపసర్పంచ్ మహేష్ కుమార్, మాజీ ఎంపీటీసీ జయమ్మ మోహన్ రెడ్డి, వార్డు మెంబర్లు పాల్గొన్నారు. అదనంగా గ్రామ కార్యదర్శి శేఖర్, మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు, రైతులు, గ్రామ పాఠశాల ఉపాధ్యాయురాలు, అంగన్వాడి టీచర్, ఫీల్డ్ అసిస్టెంట్, ఆశా కార్యకర్త, లైన్‌మెన్ అధికారి తదితరులు సభలో పాల్గొని చర్చలు జరిపారు. ఈ గ్రామసభ ద్వారా గ్రామ ప్రజల అభివృద్ధి కోరికలు, సమస్యలు సమగ్రంగా చర్చించబడి, ప్రణాళికలు రూపొందించబడ్డాయి.



# బిఆర్ఎస్‌లో ఇంటి గొడవలు

## బిజెపిలో రాముడి రాజకీయం

## ఈ రెండు పార్టీలకు తెలంగాణలో కాలం చెల్లింది

## ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే వందసీట్లు సాధిస్తాం


## టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కమార్ గౌడ్



**మంచిర్యాల, అక్షరకలం**


తెలంగాణ రాజకీయాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఉనికి కోల్పోయిందని, బీజేపీకి రాష్ట్రంలో స్థానం లేదని ఆయన అన్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో కాంగ్రెస్ నేతలతో భేటీ అయిన ఆయన.. ఈ మేరకు ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని రకాల కుట్రలు పన్నినా.. కాంగ్రెస్‌పై ప్రజలకు ఎంతో నమ్మకం ఉంది. అందుకు ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలే నిదర్శనమని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో కొంత కాలంగా అంతర్గత కలహాలు కొనసాగుతున్నాయి. కేసీఆర్ కుటుంబంలో విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. కవిత వేరు కుంపటి పెట్టుకోవడంతో బీఆర్ఎస్ పరిస్థితి రోడ్డున పడిందన్నారు. పార్టీలో కేటీఆర్, హరీశ్ రావు మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. మాజీ సీఎం కేసీఆర్ రాజకీయాలకు దూరమై.. కేవలం తన ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. ఆయన అసెంబ్లీకి కూడా రావడం లేదు. ఇలాంటి పరిస్థితిలో బిఆర్ఎస్ రోజురోజుకు దిగజారుతోందని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా బీజేపీ.. దేవుళ్ల పేరు చెప్పి ఓట్లు అడుగుతోంది. ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారు.. అందుకే ఆ పార్టీని దూరం పెడుతున్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుంది. రాష్ట్రంలో 100 సీట్లు ఖాయం' అని అన్నారు. బీజేపీ కులం, మతం పేరుతో రాజకీయాం చేస్తోందని..ఆ పార్టీకి తెలంగాణలో స్థానం లేదని విమర్శించారు. రాముడేమైనా బీజేపీ జాగీరా....వాళ్ల పార్టీల సభ్యత్వం ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేనట్టుగా తెలంగాణలో ప్రభుత్వ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. సన్నబియ్యం పథకం దేశంలోనే చారిత్రాత్మకమన్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు కాంగ్రెస్ కడుతోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో నేతల జేబుల్లోకి డబ్బులు వెళ్లాయన్నారు. మహిళలకు ఫ్రీ బస్సు స్కీం సక్సెస్ గా నడుస్తోందన్నారు. బీజేపీ రాష్టాల్లో సన్నబియ్యం ఎందుకు ఇవ్వట్లేదన్నారు. కేంద్రం లాభాల్లో ఉన్న సంస్థలను అమ్మేస్తోందని విమర్శించారు. 12 ఏండ్లలో కేంద్రం ప్రజలకు ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించారు మహేశ్ కుమార్ గౌడ్. ఇందిగాంధీ నుంచి రాహుల్ వరకు పేదల కోసం పనిచేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారని అన్నారు. దోచుకున్న సొత్తులో వాటాల గొడవలతో ఆ పార్టీ రోడ్డున పడిందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ కు 100 సీట్లు గ్యారంటీ అని ధీమా వ్యక్తం చేశారు. గ్లోబల్ సమ్మిట్ తో 5 లక్షల కోట్ల ఒప్పందాలు జరిగాయన్నారు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని చెప్పారు మహేశ్ కుమార్ గౌడ్. ఈ కర్యాక్రమంలో మంత్రి వివేక్‌తో పాటు స్థానిక నేతలు పాల్గొన్నారు.





# వంతారా ఎంతో వింతేరా! ..


## వింతైన ఆ జంతు ప్రపంచం చూసొద్దాం రండి!





చిన్న పిల్లలకి సహజంగానే జంతువులంటే ఆకర్షణ ఉంటుంది. వాటితో చాలా తొందరగా బంధాన్ని ఏర్పరచుకోగలుగుతారు. వాళ్ల కథల్లోనూ కార్టూన్లలోనూ కూడా ఎప్పుడూ అవే ఉంటాయి. వాటికి ఎలాంటి కష్టమొచ్చినా అయ్యో అని బాధపడిపోతుంటారు.అయితే, అలాంటి ఓ పిల్లాడి అనుబంధమే నేడు 200 ఏనుగులు సహా 2000 దాకా జంతువులను కాపాడే ఓ వన్యప్రాణి సంరక్షణా కేంద్రం ఏర్పాటుకు కారణమైంది. కొన్ని వందల మంది డాక్టర్లు, నిపుణులు వాటి బాగోగులు చూసుకునే బాటయింది. రిలయన్స్ సంస్థల అధినేత ముకేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీనే ఆ పిల్లవాడు. ఇక, వింతైన ఆ జంతు ప్రపంచమే గుజరాత్ రాష్ట్రపు జామ్ నగరలో ఉన్న 'వంతారా జూ'!అనంత్ అంబానీకి పన్నెండేండ్ల వయసులో తల్లి నీతాతో కలిసి ఓ ఊరికి వెళుతున్నాడు. అందమైన చెట్లు, పరిగెడుతున్నాయా అనిపించే ఊళ్లూ చూస్తూ కూర్చున్నాడు అనంత్. అదే దారిలో ఓ ఏనుగు పిల్ల కనిపించిందతనికి. ఇంకేం, ఎగిరి గంతేసినంత పనిచేశాడు. కానీ పరిశీలించి చూస్తే పాపం అది ఎంతో ఇబ్బందిగా నడుస్తున్నది. మావటి వాడు దాన్ని ఎలాగోలా తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నాడు.



అది చూసిన అనంత్ మనసు చలించిపోయింది. 'పాపం కదా అమ్మా%ొా% మనం పెంచుకుందామా దాన్ని' అని అడిగాడు. 'సరే నువ్వు జాగ్రత్తగా చూసుకుంటావా మరి'%ొా%అని అడిగింది తల్లి. 'అవునమ్మా%ొా% నేను దాన్ని బాగా చూసుకుంటాను%ొా%' అని చెప్పాడా పిల్లవాడు.అలా ఆ ఏనుగు పిల్ల అనంత్ దగ్గరికి చేరింది. 'దాన్ని తీసుకున్నప్పటికి కనీసం అది ఏం తింటుందో కూడా తెలీదు' అని చెబుతాడు అనంత్. 'మావటి వాడు ఏం చెబితే అదే పెట్టేవాళ్లం. దానికి ఏమైనా అయితే చికిత్స చేయించడానికి కూడా పెద్దగా నిపుణులు అందుబాటులో లేరు. అయితే ఇన్నాళ్లలో మేం చాలా నేర్చుకున్నాం. ఆ ఒక్క ఏనుగే కాదు, ఎన్నో ఆపదలో ఉన్న జంతువులు మా దగ్గర వచ్చి చేరాయి.మరెన్నో గాయాల పాలై, ప్రాణాపాయంలో ఉన్న జీవులు ఇక్కడ కోలుకుని ఆనందంగా ఆడుకుంటున్నాయి. వాటికోసం ఎంతో పరిశోధనలు చేసి వందల సంఖ్యలో నిపుణుల్ని నియమించాం. విభిన్న జాతుల జంతువులు ఇక్కడి అడవిలో చక్కగా తిరుగుతూ ఉండటం చూస్తే ఎవరికైనా ఆనందం కలుగుతుంది'%ొా% అని తన ఈ ముందడుగు గురించి చెబుతాడు అనంత్. ఇంతకీ వంతారా అంటే ఏమిటో చెప్పలేదు కదూ%ొా% స్టార్ ఆఫ్ ద ఫారెస్ట్%ొా% అడవి చుక్క అని అర్థం!వంతారాలో మొత్తం 43 విభిన్న జాతులకు చెందిన 2000 దాకా జంతువులు ఉన్నాయి. అందులో 200 ఏనుగులు ఉన్నాయి. మంచు చిరుతలు, తెల్ల పులులతో పాటు విభిన్న రకాల చిరుతలు, పులులు, సింహాలు ఇక్కడ తిరుగుతుంటాయి. అనేక రకాల పాములు, మొసళ్లు, జిరాఫీలు, జీబ్రాలు, హిప్పోలుభారత్ సహా ప్రపంచంలోని విభిన్నప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి చేరాయి. అంతేకాదు, అంతరించిపోతున్న జాతులుగా ఉన్న దేవాంగ పిల్లి, బట్టమేక పిట్ట, రాబందు, ఒకాపి, కారకల్ లాంటి జంతు, పక్షుజాతులెన్నో ఇక్కడ తమ ఉనికిని పెంపొందించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నాయి. గుజరాత్ రాష్ట్రంలోని జామ్ నగర్‌లో మొత్తం 3000 ఎకరాల్లో ఉన్న దీనిలో ఈ జీవులన్నీ తమ కోసం కేటాయించిన విశాలమైన ప్రాంగణాల్లో సంచరిస్తుంటాయి.అడవుల నరికివేత వల్ల తమ స్థావరాలను కోల్పోవడం, వేట, స్మగ్లింగ్%ొా%లాంటి రకరకాల ప్రమాదాలకు గురయిన జంతువులే ఇవన్నీ. వేరువేరు ఆరోగ్య సమస్యలతో వచ్చే వాటిని ఇక్కడి నిపుణులైన వైద్యులు పరిశీలిస్తారు. ప్రపంచంలోనే అగ్రశ్రేణి వైద్యులు, జంతు సంరక్షణ నిపుణులతో పాటు న్యూట్రీషనిస్టులు, పాథాలజిస్టుల్లాంటి 500 మంది అంకిత భావం కలిగిన నిపుణుల బృందం వీటి జబ్బులు, గాయాలను నయం చేసేందుకు పనిచేస్తున్నది.క్రూర జంతువులా, సాధు జంతువులా, సరీసృపాలా అన్నదాన్ని బట్టి అన్ని జంతువులకూ స్వేచ్ఛగా సంచరించేందుకు సరిపడా స్థలాన్ని కేటాయిస్తారు. వీటి బాగోగులు ఎప్పటికప్పుడు జాగ్రత్తగా చూసుకునేందుకు 2100 మంది దాకా ఉద్యోగులు ఉన్నారు. 75 యానిమల్ అంబులెన్సులు కూడా ఉన్నాయిక్కడ.వంతారాలో ప్రధాన ఆకర్షణ ఏనుగులే. ఇక్కడ ఉండే 200కు పైగా గజరాజుల సంరక్షణ కోసం 25000 చదరపు అడుగుల్లో ఆసుపత్రి కట్టారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్దది. భారీగా ఉండే ఈ జంతువులకు ఆర్థరైటిస్‌లాంటి ఎముకల సమస్యలు ఏర్పడుతుంటాయి. దానికి హైడ్రోథెరపీ అని చేస్తారు. కాళ్ల సమస్యలు, కీళ్ల నొప్పులు ఉండే ఏనుగులు ఇక్కడి హైడ్రోథెరపీ పూల్స్‌లో కొన్ని గంటల పాటు సేదతీరి, సాంత్వన పొందుతుంటాయి.ఇవికాక, ముల్తానీ మట్టి మసాజ్, జకుజీ (బాత్ టబ్ థెరపీ)లాంటివీ వీటి కోసం ఏర్పాటు చేశారు. ఇక, ఇందులో నివసించే జంతువుల ఆరోగ్య పరీక్షల కోసం, శస్త్ర చికిత్సలు, ఇతర చికిత్సల కోసమూ ఏర్పాట్లున్నాయి. ఎక్కడికి కావాలంటే అక్కడికి తీసుకువెళ్లగలిగే పోర్టబుల్ ఎక్స్-రే, లేజర్ మెషీన్‌లు, సీటీ, ఎంఆర్ఐ యంత్రాలు, ఐసీయూ, డయాలిసిస్ కేంద్రం, పాథాలజీ ల్యాబ్, ఆపరేషన్ థియేటర్లు, హైపర్ బారిక్ ఆక్సిజన్ ఛాంబర్లు ఉంటాయి. అల్ట్రాసౌండ్, ఎండోస్కోపీలాంటివి పరీక్షలు చేసే పరికరాలూ ఇక్కడ ఉన్నాయి.కేవలం జంతువులను కాపాడి ఆరోగ్యాన్ని బాగు చేయడమే కాదు, వాటి గురించిన పరిశోధనలు జరిపే ప్రత్యేక విభాగమూ వంతారాలో ఏర్పాటయింది. ఆపదలో ఉన్న జంతువుల సంరక్షణ కోసం ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (%×ఖజచీ%), వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ ఫర్ నేచర్ లతో కలిసి పనిచేస్తున్నది వంతారా.వివిధ దేశాల్లోని జంతు సంరక్షణ కేంద్రాలతో పాటు ముఖ్యంగా మెక్సికో, వెనెజుల్లాలో ఉన్న రెస్క్యూ సెంటర్ల భాగస్వామ్యమూ ఉంది. భారత్‌లోని నేషనల్ జూ అథారిటీతోనూ టై అప్ అయ్యింది వంతారా. దేశవ్యాప్తంగా జూ లను ఏర్పాటు చేసేందుకు మంతనాలు చేస్తున్నది. ఇటీవలే ప్రధాని అధికారికంగా ఓపెన్ చేసిన ఇది, త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానుంది.'ఆవులో మూడు కోట్ల దేవతలూ ఉంటారంటారు. నేను ప్రతి ప్రాణిలోనూ దేవుడిని చూస్తాను. వాటికి సేవ చేయడం నిజంగా అదృష్టంగా భావిస్తాను. ఎందుకంటే మనుషులకు సేవ చేసే వాళ్లు చాలామందే ఉంటారు. కానీ నోరులేని ఈ ప్రాణులకు సేవ చేసే వాళ్లు చాలా తక్కువ. అందుకే అలాంటి జంతువుల కోసం ఈ నా ముందడుగు ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను.' అంటూ ప్రేమ పూర్వక గొంతుకతో చెబుతాడు అనంత్. ఆపద నుంచి గట్టెక్కిన ఎన్నో మూగజీవాలకు ఈ నీడ నిజంగా దేవుడి తోడే కదూ!







# ఘనంగా దొడ్డి కొమరయ్యకు ఘనంగా నివాళులర్పించిన సిపిఎం నేతలు.

అక్షర కలం / ఇల్లందు.



నైజాం సర్కారు కు దొరలు జమీందారులు జాగీర్దారులు దేష్ముఖ్ లకు వ్యతిరేకంగా జరిగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం లో తొలి అమరుడు దొడ్డి కొమరయ్యా జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక ఏలూరి భవన్ లో సిపిఎం నేతలు కార్యకర్తలు దొడ్డి కొమరయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అబ్దుల్ నబి, ఆలేటి కిరణ్ కుమార్ లు పాల్గొని మాట్లాడుతూ నాడు కమ్యూనిస్టుల ఆద్వర్యం లో జరిగిన వీరోచిత పోరాటం లో 3వేలమంది కమ్యూనిస్టు కార్యకర్తలు ప్రాణాలు కోల్పోవడం జరిగిందని, దొరల నుండి పది లక్షల ఎకరాల భూమి పేదలకు పంపిణీ జరిగిందని చరిత్రాత్మక పోరాటం లో తొలి అమరుడు దొడ్డి కొమరయ్యా అని అన్నారు. ఈ కార్యక్రమం లో తాళ్లూరి కృష్ణ,మన్యం మోహన్ రావు,పెద్దబోయిన నర్సయ్య, అయ్యూబ్,లక్ష్మీనారాయణ, శేషయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య జీవిత ఆశయాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలి... స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:



దొడ్డి కొమురయ్య జీవిత ఆశయాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తెలిపారు. శుక్రవారం లకారం ట్యాంక్ బండ్ వద్ద జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ దొడ్డి కొమురయ్య జయంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని, దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి వీరమరణం పొందిన యోధుడిగా దొడ్డి కొమురయ్య చరిత్రలో చిర స్థాయిగా నిలిచారని, వారి ధైర్యం, త్యాగం, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం మనకు స్ఫూర్తిదాయకం అని అన్నారు. రాజకీయ, సామాజిక రంగాలలో ఎదురైన అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడారని, రైతుల హక్కులు, పేదల సంక్షేమం కోసం చేసిన త్యాగం ఎప్పటికీ మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, తెలంగాణ జిల్లా గౌడ సంఘ అధ్యక్షులు కత్తి నెహ్రూ గౌడ్, బిసి సంఘ నాయకులు కూరాకుల నాగభూషణం, కురుమ సంఘ జిల్లా అధ్యక్షులు మాయర గంగయ్య, గౌరవ సలహాదారు చావళ్ల నాగేశ్వరరావు, కోడి లింగయ్య, చిత్తారు ఇందుమతి, గూడె మల్లయ్య, భూక్యా శోభా నాయక్, కొరిపల్లి శ్రీనివాస్, పెల్లూరి విజయ్ కుమార్, సాదిక్ అలీ, మేకల సుగుణా రావు, చావల నాగరాజు, మూడుముంతల గంగరాజు, తమ్మారపు బ్రహ్మయ్య, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా త్రివేణి గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో ప్రైమరీ విద్యను అభ్యసిస్తున్న చిన్నారులకు పాఠశాల యాజమాన్యం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించినట్లు త్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలిపారు. అలాగే గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన విద్యార్థిని విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈరోజు త్రివేణి పాఠశాలలో జరిగిన 5వ తరగతి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ ప్రొఫెసర్ ఎస్ ఆర్ ఎండ్ బి జి ఎన్ ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ ఫిజిక్స్ డాక్టర్ ఎస్ రాంబాబు హాజరయ్యారు. ముఖ్యఅతిథి మాట్లాడుతూ చిన్నపిల్లల మనసు ఎంతో సున్నితమైందని ఆ మనసును కష్టపెట్టకుండా మానసిక



ఒత్తిడికి దూరంగా ఆడుతూ పాడుతూ నేర్చుకునే లాగా ఒత్తిడి లేని విద్యను అందించాలని సూచించారు,అంతేకాకుండా తల్లిదండ్రులు తమ విలువైన నాణ్యమైన సమయాన్ని పిల్లల కోసం కేటాయించాలని మానవ సంబంధాలు నైతిక విలువలు చిన్నప్పటి నుంచే బోధించాలని ఈ బాధ్యత ఉపాధ్యాయుల పైన తల్లిదండ్రుల పైన ఎంతో ఉందని సూచిస్తూ, పిల్లలు సైంటిఫిక్ అప్రోచ్ పెంపొందించుకోవాలని తెలియజేశారు. పిల్లల ఎదుగుదలలో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమని వారి ప్రాముఖ్యతని వివరించారు. కేజీ విద్యను పూర్తి చేయడానికి సహకరించిన ఉపాధ్యాయులను అభినందించారు ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతో ఆకట్టుకున్నాయి అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేశారు కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, ట్రాన్స్పోర్ట్ ఇంచార్జ్ సందీప్ మరియు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మరియూ విద్యార్థినీ విద్యార్థులు,వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఖమ్మం ప్రెస్ క్లబ్ వార్షిక శ్వేత పత్రం విడుదల

హర్షం వ్యక్తం చేసిన జర్నలిస్టులు

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

ఖమ్మం ప్రెస్ క్లబ్ పాలకమండలి వార్షిక ఆదాయ, వ్యయాల శ్వేత పత్రాన్ని విడుదల చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వార్షిక ఆదాయ వ్యయాలను టి యు డబ్ల్యూ జే (ఐజేయు), టి యు డబ్ల్యూ జే (టి జే ఎఫ్) ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నామ పురుషోత్తం, గుద్దేటి రమేష్ బాబు లు వెల్లడించారు. ఏప్రిల్ 2025 నుంచి మార్చి 2026 వరకు ఈ 12 నెలల కాలంలో 74 ప్రెస్ మీట్ల కు గాను 1,06,500 ఆదాయం లభించిందని, వీటిలో వర్కర్ జీతం,




కరెంటు బిల్లు, వాటర్ బిల్లు, మైక్ సెట్ ల కొనుగోలు, విద్యుత్ పరికరాల కొనుగోలు, ప్రెస్ క్లబ్ కు అవసరమైన స్టేషనరీ తదితర కొనుగోళ్లకు రూ.75,756 రూపాయలు ఖర్చు అయినట్లు తెలిపారు. వీటిల్లో ఈ ఏడాది రూ.30,744 రూపాయలు మిగులు బడ్జెట్ గా లభించిందని ప్రకటించారు. ప్రెస్ క్లబ్ అభివృద్ధికి ప్రతి జర్నలిస్ట్ తమ సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీలు వార్షిక ఆదాయ, వ్యయాల శ్వేత పత్రాన్ని విడుదల చేయటం పట్ల జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టి యు డబ్ల్యూ జే (ఐ జే యు) ప్రెస్ క్లబ్ కార్యదర్శి శీలం శ్రీనివాస్, టి యు డబ్ల్యూ జే (టిజేఎఫ్) ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు పి. పానకాలరావు, రేపాక యాదగిరి, పులి శ్రీను, ప్రచార కార్యదర్శి కూరపాటి నరేష్, కమిటీ సభ్యులు మురళి, ఉల్లోజు రమేష్, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, శంకర్, ఐజేయు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా దురహంకారంతోనే ఇరాన్ పై దాడికి పాల్పడుతుంది

## సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు.

## ఇల్లందులో మే 11, 12,13 తేదీలలో ఏఐయుకేఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి.

## ఏఐయుకేఎస్ జాతీయ కన్వీనర్ కెచ్చెల రంగారెడ్డి.

అక్షర కలం / ఇల్లందు.




అమెరికా దురహంకారంతోనే ఇరాన్ పై దాడికి పాల్పడుతుందని, అమెరికా సామ్రాజ్యవాదులు, ఇజ్రాయిల్ దురహంకార కోరికలతో ఇరాన్ పై జరుపుతున్న యుద్ధ ప్రభావం వల్ల అనేక దేశాలలో గ్యాస్, ఇంధన ధరలు పెరిగిపోయి తీవ్రమైన సంక్షోభానికి గురై ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు అని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. ఇల్లందు పట్టణంలోని చంద్ర కృష్ణమూర్తి భవనంలో శుక్రవారం ఏఐయుకేస్ జాతీయ మహాసభల సందర్భంగా ఆహ్వాన సంఘం ఏర్పాటు సభకు జిల్లా అధ్యక్షులు బుర్ర వెంకన్న అధ్యక్షత వహించగా వారు పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలో యుద్ధ వాతావరణం నెలకొని ప్రజలపై ఆర్థిక భారం పడి దేశంలో అధిక ధరలు చెలరేగిపోతున్న సందర్భంలో అఖిలభారత ఐక్య రైతు జాతీయ మహాసభలు విజయవంతంగా జరుపుకొని ఈ మహాసభలను తగిన నిర్ణయాలు తీసుకొని దేశ ఆర్థిక సంక్షోభావాన్ని నిర్వారించేందుకు రైతు పోరాటాలు నిర్వహించాలని ఈ క్రమంలో రైతులకు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ అండగా ఉంటుందని పోటు రంగారావు తెలిపారు. అఖిలభారత ఐక్య రైతు సంఘం జాతీయ కన్వీనర్ కెచ్చల రంగారెడ్డి మాట్లాడుతూ మే 11,12,13 తేదీల్లో ఇల్లెందు పట్టణంలో జరిగే అఖిలభారత ఐక్య రైతు సంఘం జాతీయ మహాసభలకు దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల నుండి ప్రతినిధులు, 300 మంది హాజరు కాబోతున్నారని మొదటిరోజు వేలాదిమంది ప్రజలతో భారీ ప్రదర్శన బహిరంగ సభ ఉంటుందని ఆయన తెలిపారు. ఈనాడు దేశంలో ప్రపంచంలో నెలకొన్న ప్రత్యేక రాజకీయ పరిస్థితుల్లో ఈ మహాసభలు జరపడం ఒక ప్రాధాన్యత కలిగిన విషయమని ఇందులో ఆర్థిక, రాజకీయ,సామాజిక అంశాలతో పాటు సంఘం కార్యకలాపాలు,చేపట్టిన ఉద్యమాలను,నిర్మాణాన్ని చర్చించుకొని భవిష్యత్ కర్తవ్యాలు రూపొందించుకుంటామని ఆయన తెలిపారు. ఈ సభలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, ఏఐయుకేఎస్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బి రాము,చిన్న చంద్రన్న, చంద్ర అరుణ తదితరులు సందేశం ఇచ్చారు. సభానంతరం ఆహ్వాన సంఘం ఏర్పాటు చేశారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు గుమ్మడి నరసయ్య, అధ్యక్షులుగా సీనియర్ జర్నలిస్ట్ తుమ్మలపల్లి ప్రసాద్, ఉపాధ్యక్షులు చిన్న చంద్రన్న, ప్రధాన కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి, సహాయ కార్యదర్శి బి.రాము తో పాటు ప్రజాసంఘాల నాయకులు, విద్యావేత్తలు, విప్లవాభిమానులు సభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిపిఎంఎల్ మాస్ లైన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి బిక్షమయ్య, జిల్లా సహాయ కార్యదర్శి నాయిని రాజు, ఇల్లందు డివిజన్ కార్యదర్శి ఈసం శంకర్,అమర్లపూడి రాము జాటోత్ కృష్ణ సిపిఎంఎల్ మాస్ లైన్ ఇల్లెందు డివిజన్ నాయకులు యాకూబ్ షావలీ,ఆర్.బోసు, పూణెం కుమార్,ఆవుల కిరణ్ ,యదళ్ళపల్లి సావిత్రి, పి డి యస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ, బుర్ర రాఘవులు, కొమరం శాంతయ్య,శ్రీరాం కోటయ్య, మల్లెల వెంకటేశ్వర్లు,గాంధీ,బండారి సత్యం తదితరులు పాల్గొన్నారు.

# భూదాన నిర్వాసితులందరికీ న్యాయం చేయాలి

## ఇళ్లు కోల్పోయిన వారందరికీ అక్కడే ఇళ్లు ఇవ్వాలి

## ఓపిఆర్డి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ జతిన్ కుమార్, విజయేందర్

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :




ఖమ్మం వెలుగుమట్లలో ఇల్లు కోల్పోయిన నిర్వాసితులందరికీ అక్కడ ఇళ్లస్థలాలిచ్చి ఇళ్లు కట్టించి ఇవ్వాలని ఓపిఆర్డి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ జతిన్ కుమార్, విజయేందర్ డిమాండ్ చేశారు. ఖమ్మంలోని ప్రెస్క్లబ్లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ మంత్రుల ఆదేశాలతో ఎనిమిదేళ్లుగా అక్కడే నివాసముంటున్న పేదల ఇళ్లను అమానుషంగా కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెలుగుమట్ల కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించకపోయినా వారు అనేక ఇబ్బందులు పడుతూ అక్కడే నివశిస్తున్నారని, వారి ఆవేదనను అర్థం చేసుకోకుండా రెవెన్యూ, పోలీస్ అధికారులు కూల్చివేశారని విమర్శించారు. పైగా డబ్బులు వసూలు చేశారంటూ అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఫిబ్రవరిలో నిజనిర్ధారణ కమిటీ అక్కడ పర్యటించిందని, రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ ఆధ్వర్యంలో విచారణ జరిపారని, పట్టాలున్న పేదల్లో భయభ్రాంతులు పోగొట్టాలని డిమాండ్ చేశారని వారు గుర్తు చేశారు. కమిటీ పర్యటించిన తర్వాత మంత్రుల ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీస్ అధికారులు ఇళ్లను కూల్చివేశారని విమర్శించారు. ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు రావడంతో కొంతమందిని ఎంపిక చేసి, అక్కడనే ఇల్లు ఇస్తామని చెప్పి అర్హులకు అన్యాయం చేస్తోందన్నారు. అర్హులైన వారందరికీ అక్కడనే ఇళ్లస్థలం కేటాయించి ఇళ్లు కట్టించి ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఓపిడిఆర్ రాష్ట్ర బాధ్యులు డాక్టర్ మోహన్ పాల్గొన్నారు.

# క్యాతనపల్లి ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన బందోబస్తు

## బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 03:



జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపాలిటిలో శనివారం నిర్వహించనున్న మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్ ల ఎన్నిక సజావుగా జరిగేందుకు, శాంతి భద్రతలను కాపాడేందుకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయబడినవి అని బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బందోబస్తులో ఏసీపీ -04, సీఐ - 23, ఎస్ఐ - 46, ఏఎస్ఐ / హెడ్ కానిస్టేబుల్ - 98, పోలీస్ కానిస్టేబుల్ -167, మహిళా పోలీస్ సిబ్బంది -49, స్పెషల్ పార్టీ సిబ్బంది -38, హోం గార్డ్స్ -60 మొత్తం 485, 4 టిజీఎస్పి ప్లాటన్ లు విధుల్లో పాల్గొంటున్న పోలీసు అధికారులకు, సిబ్బందికి బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఏసిపి కిరణ్ కుమార్ మాట్లాడుతూ, ఎన్నిక సందర్భంగా శాంతి భద్రతలను కచ్చితంగా పాటించాలని, ఉన్నతాధికారుల ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. డ్యూటీ ప్రదేశం నుండి ఎట్టి పరిస్థితి అనుమతి లేకుండా విడిచి వెళ్ళకూడదన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, విధుల్లో అప్రమత్తంగా ఉండి సమయానుకూలంగా ప్రవర్తించాలని, అనవసరంగా ప్రజలతో వాగ్వాదాలకు దిగకూడదని, విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం ప్రదర్శించకూడదన్నారు. ఎన్నిక ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తగినన్ని భద్రతా చర్యలు తీసుకున్నామని, ప్రజలు, ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు పోలీసులకు సహకరించాలని కోరారు.

# తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 03:



నిజాం నిరంకుశ పాలనలో ప్రజల సంక్షేమం, భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ ఉద్యమంలో దొడ్డి కొమురయ్య అలుపెరుగని పోరాటం చేశారని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య జయంతి ఉత్సవాలకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, వెనుకబడిన తరగతుల కులాల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై, దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి, పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనలో అణిచివేతకు గురవుతున్న ప్రజల ఆత్మగౌరవం, భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటం ఉద్యమంలో దొడ్డి కొమురయ్య వీరోచిత పోరాటం చేశారన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితులపై చైతన్యపరిచి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేశారని తెలిపారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం దొడ్డి కొమురయ్య చేసిన పోరాటం యువతకు మార్గదర్శకమన్నారు. దేశ స్వాతంత్ర్యం, ప్రజల సంక్షేమం కోసం వీరోచితంగా పోరాడి, ప్రాణ త్యాగాలు చేసిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వసతి గృహాల సంక్షేమ అధికారులు, యాదవ, కురుమ కుల సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఐపీఎల్ మ్యాచ్‌లకు కట్టుదిట్టమైన భద్రత

## స్టేడియం సందర్శించిన ఇన్‌ఛార్జ్ సీపీ సుధీర్ బాబు

ఉప్పల్, ఏప్రిల్ 3 (అక్షర కలం): ఐపీఎల్ మ్యాచ్‌ల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను సమీక్షించేందుకు ఇన్‌ఛార్జ్ సీపీ సుధీర్ బాబు ఐపీఎస్ శుక్రవారం రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంను సందర్శించారు. ఈ సందర్భంగా డీసీపీ సురేష్, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు తో కలిసి స్టేడియం పరిసరాల్లో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. మ్యాచ్‌ల సమయంలో ప్రేక్షకుల రాకపోకలు, వాహన నిల్వ స్థలాలు, రవాణా నియంత్రణ, ప్రవేశ-- నిష్క్రమణ ద్వారాల వద్ద కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని అధికారులకు ఆదేశించారు. అవాంఛనీయ ఘటనలు



జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, నిఘా కెమెరాలు, బాంబు నిర్వీర్య దళం, శునక దళాన్ని అప్రమత్తంగా ఉంచాలని సూచించారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తేనే మ్యాచ్‌లు సజావుగా నిర్వహించవచ్చని తెలిపారు.

# నేటి క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికకు పూర్తి ఏర్పాట్లు

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 03:

మున్సిపల్ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఏప్రిల్ 4 శనివారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపాలిటీలో చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ల పరోక్ష ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య తెలిపారు. శుక్రవారం బెల్లంపల్లి సబ్ కలెక్టర్, ఎన్నికల పరిశీలకులు మనోజ్ తో కలిసి క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయాన్ని సందర్శించి, బి-ఫామ్ జారీకి సంబంధించి ఫామ్-ఘ (అధికార ప్రతినిధి అధికరణ పత్రాలు)ను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎన్నికల హాల్ ను పరిశీలించి, బారి కేడింగ్, భద్రతా ఏర్పాట్లు, సదుపాయాలను తనిఖీ చేసి బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్, రామకృష్ణాపూర్ ఎస్ఐ శ్రీధర్ లతో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు ప్రత్యక్ష ప్రసారం ఏర్పాట్లు చేయాలని, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేసి, అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం

-- ప్రభాకర్‌పై వ్యాఖ్యలకు నిరసన

-- ఎలివేటెడ్ కారిడార్‌కు వాజ్‌పేయి పేరు పెట్టాలని డిమాండ్

**ఉప్పల్, ఏప్రిల్ 3 (అక్షర కలం):**



ఉప్పల్‌లో బిజెపి నాయకులు స్థానిక ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్ట్ పూర్తిగా మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ కృషి ఫలితమేనని పేర్కొన్నారు. పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఆయన విజనరీ ఆలోచనతో కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గట్కారి చేతుల



మీదుగా సుమారు రూ.680 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేయించారని వివరించారు. అయితే, ఆ తరువాత వచ్చిన బిఆర్ఎస్ ప్రభుత్వం మరియు ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కారణంగా రోడ్డు విస్తరణ, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్లు వంటి పనులు ఆలస్యమయ్యాయని ఆరోపించారు. దీంతో ప్రాజెక్ట్ పురోగతి మందగించిందని అన్నారు.

**-- ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఆలస్యం: బిజెపి**

తరువాత మల్కాజిగిరి ఎంపీగా ఎన్నికైన ఈటెల రాజేందర్ ప్రత్యేక చొరవ తీసుకుని కేంద్ర, రాష్ట్ర స్థాయిలో చర్చలు జరిపి ప్రాజెక్ట్ వేగవంతానికి కృషి చేశారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు మాజీ ఎమ్మెల్యే బండారు రాజిరెడ్డి పేరు పెట్టాలని నిర్ణయించడం తగదని బిజెపి నాయకులు విమర్శించారు.

**-- వాజ్‌పేయి పేరు పెట్టాలి: డిమాండ్**

జాతీయ రహదారుల అభివృద్ధికి విశేష కృషి చేసిన మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి పేరు ఈ ప్రాజెక్ట్‌కు పెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి వాడిన భాష అసభ్యంగా ఉందని, ప్రజాప్రతినిధిగా ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని మండిపడ్డారు. భవిష్యత్తులో బిజెపి నాయకులపై లేదా మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌పై చౌకబారు వ్యాఖ్యలు చేయకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోరిగే కృష్ణ, మహంకాళి లక్ష్మణ్ ముదిరాజ్, గోంగూలూరి శ్రీనివాస్ శర్మ, ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్, రెడ్డిగారి దేవేందర్ రెడ్డి, ఎం సతీష్, వర్కల రాజేందర్ గౌడ్, సింగారం కార్తీక్, బోరంపేట మురళీ, బండి పద్మ, ఈదులకంటి నవీన్ గౌడ్, అజయ్ గుప్తా, దాసరి యాదగిరి, శ్రీరాం జ్యోతి, శామీర్‌పేట్ చంద్రయ్య, పుప్పాల వెంకటేశ్వర్లు, బి విద్యాసాగర్, రామరాజు యాదవ్, రాజేష్, పలుగుల యాదగిరి, వెంకటేశ్వరి, బకారం భద్రయ్య, రాయల్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో నిరుపేదల సొంతింటి కల సాకారం



**మందమర్రి, ఏప్రిల్ 03 అక్షర కలం ప్రతినిధి:**

రాష్ట్రంలో నిరుపేదల సొంతింటి కలను ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాసు సంతోష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పొన్నారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులు సూరిమిల్ల శ్రీలత – సుధాకర్ లు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంతోష్ ముఖ్య అతిథిగా హాజరై, పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధన ప్రకారం ఇంటి నిర్మాణం పూర్తి చేసి సకాలంలో బిల్లులు పొందాలని సూచించారు అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొజ్జ రాములు, బేర సమ్మయ్య, రాజలింగు, నీలం రవి, నాగరాజు లు పాల్గొన్నారు.

# క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ యాక్ట్ అమలు

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మార్చి 03:**



రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో శనివారం ఉదయం 6 గంటల నుండి చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ యాక్ట్ అమల్లో ఉంటుందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ ఆంక్షల కాలంలో నలుగురికి మించి గుంపులుగా చేరడం పూర్తిగా నిషేధమన్నారు. ప్రశాంతమైన వాతావరణాన్ని ఉద్రిక్తం చేసే రెచ్చగొట్టే వ్యాఖ్యలు, కవ్వింపు చర్యలు, గొడవలకు దారితీసే ప్రవర్తన ఏదైనా చోటుచేసుకున్నట్లయితే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులు, అటవీ అధికారులు, కేంద్ర బలగాలు, హోంగార్డులు, ఎస్పీఓ లకు ఈ నిషేధాలు వర్తించవని స్పష్టం చేశారు. చట్టపరమైన అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తా రోకో లు, ఊరేగింపులు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదని, ఎవ్వరు కర్రలు, కత్తులు, తుపాకులు లేదా ఎలాంటి మారణాయుధాలతో సంచరించడం పూర్తిగా నిషేధమన్నారు. మైకులు, లౌడ్ స్పీకర్ల లతో పాటలు ప్రసారం చేయడం, సభలు నిర్వహించడం, ప్రజలను ఒక వర్గం మీద మరొక వర్గం మీద రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేయడం నిషేధమని తెలిపారు. సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ అమలు సమయంలో చట్టబద్ధమైన అధికారాన్ని ధిక్కరించే విధమైన ప్రకటనలు, ప్లకార్డులు, గుర్తులు ప్రదర్శించడం సైతం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు.

# ఎద్దేడిసిన యవుసం - రైతు ఏడ్చిన రాజ్యం

# బాగుపడ్డ దాఖలాలు లేవు... వంటేరు ప్రతాపరెడ్డి

## కొండపాక మండలం దుద్దెడ లో ఎండిపోతున్న పంటలను చూసి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం పై మండిపడ్డ వంటేరు ప్రతాపరెడ్డి

## దుద్దెడ గ్రామంలో బి ఆర్ స్ మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎండిపోయిన వరి పంటలను పరిశీలించిన గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి

**అక్షర కలం సిద్దిపేట ఏప్రిల్ 03:**

కొండపాక మండలంలోని దుద్దెడ గ్రామంలో పుట్ట మల్లేశం అనే రైతు మూడు ఎకరాలలో వరి వేసుకోగా రెండు ఎకరాలలో సక్రమంగా కరెంటు రాక వరి పంట పూర్తిగా ఎండిపోయిందని గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ముందు రైతు ఆవేదన వ్యక్తం చేస్తూ కన్నీటి పర్యంతమయ్యాడు. కెసిఆర్ ప్రభుత్వంలో నిమిషం పాటు కూడా కరెంటు పోలేదని, ఎరువులు విత్తనాలు ఇంటి వద్దకే వచ్చేవని, నాట్లు వేసే సమయంలోనే రైతుబంధు కేసీఆర్ వేశారని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి సమర్థ పాలన రైతుల పట్ల శాపంగా మారిందనిమండిపడ్డారు. రైతులకు కరెంటు సక్రమంగా రాక పంటలు ఎండిపోతున్న రేవంత్ రెడ్డికి చీమకుట్టినట్లు కూడా లేదని తెలిపారు. రైతాంగానికి 12 గంటల కరెంటు కూడా ఇవ్వడం లేదని, ఇచ్చిన కరెంట్ ఎప్పుడు వస్తది ఎప్పుడు పోతదో తెలియకుండా రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని తెలిపారు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు, లో వోల్టేజ్ కరెంటు, ట్రాన్స్ఫార్మర్లు కాలిపోవడం, మోటర్లు కాలిపోవడం ఉండేటివి నేడు రేవంత్ రెడ్డి పాలనలో కూడా కరెంటు లేక, ఎరువులు విత్తనాలు రాక, రైతుబంధు లేక, రేవంత్ రెడ్డి రైతులపై అక్కాసు వెలగకుతున్నారని, రైతులపై కక్ష సాధింపు చర్యలుచేపడుతున్నారని మండిపడ్డారు. నాడు కెసిఆర్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతుల కష్టాలను చూసి, రైతుల ఆత్మహత్యలు చూసి చలించిపోయి చావు నోట్లో తలపెట్టి ఉద్యమాలను చేపట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిపెట్టి కాళేశ్వరం, మల్లన్న సాగర్ కొండపోచమ్మ సాగర్ రంగనాయక సాగర్, లాంటి ప్రాజెక్టుల నిర్మాణం చేసి ఎడారిగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని పచ్చని పాడి పంటలతో సస్యశ్యామలం చేసి రైతులను ఆర్థికంగా బలోపేతం చేస్తే నేడు రేవంత్ రెడ్డి రైతులను దివాలా తీయిస్తున్నారని



మండిపడ్డారు. రైతుల పంటలకు కేసీఆర్ ప్రభుత్వం 24 గంటల నాణ్యమైన నిరంతరం కరెంటు ఇస్తే నేడు రాజ్యమేలుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆంక్షలుతో 12 గంటల అరకొర కరెంటు ఇచ్చి రైతుల పంటలు ఎండ కొడుతున్నారని, రైతులను అప్పులపాలు చేస్తున్నారని, రైతుల ఆత్మహత్యలు రేవంత్ రెడ్డి పాలనలో పెరిగాయని, రైతుల నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు, అబద్ధాల పునాదుల 420 అమలు కానీ హామీలతో, 6 గ్యారంటీలతో ఏర్పడిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రైతుల ఉసురు తగులుతుందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై లక్ష కోట్లు వృధా అని చెప్తున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దుష్ప్రచారాన్ని మానుకోవాలని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు లేకపోతే 3 లక్షల టన్నుల వరి ధాన్యం ఎట్లా పండిందని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా భారతదేశానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా తెలంగాణ రాష్ట్రం అవతరించిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మల్లన్న సాగర్ నుండి తిమ్మాయిపల్లి వరకు టన్నెల్ మరియు కాల్వపనులను వెంటనే పూర్తి చేస్తే కొండపాక మండలం తో పాటు పక్క మండలాలు సస్యశ్యామలమవుతాయని రైతులు కరెంటుపై ఆధారపడరని తెలిపారు. వెంటనే కాలువలను టన్నెల్ ను పూర్తి చేసి సాగునీరు రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరంపై కేసీఆర్ కుటుంబం పై రేవంత్ రెడ్డి కక్ష కట్టారని, సిద్దిపేట జిల్లా మెదక్ జిల్లా సంగారెడ్డి జిల్లాల రైతులపై రేవంత్ రెడ్డి కక్ష కట్టి పెండింగ్ లో ఉన్న కాలువలకు నిదురు మంజూరు చేయకుండా రైతులపై వెలగకుతున్నారని, రైతులు జీవితాలతో రేవంత్ రెడ్డి చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మర్చిపోకండి ఉమ్మడి మెదక్ జిల్లా ప్రాంతం కూడా తెలంగాణలో ఉందని ఇక్కడి ప్రాంతం సస్యశ్యామలం కావాలంటే పెండింగ్లో ఉన్న కాలువల నిర్మాణం జరగాలని దానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఇక్కడి రైతులపై వివక్ష సరికాదని ఇక్కడి రైతాంగానికి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ నియోజకవర్గం లో రైతులకు 18 గంటల నిరంతర కరెంటు ఇస్తున్నారు. కానీ కక్షతో గజ్వేల్ సిద్దిపేట్ దుబ్బాక నియోజకవర్గ రైతాంగానికి12 గంటల కరెంటు కూడా ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి తమ వక్రబుద్ధిని మార్చుకొని రైతుల పట్ల చిత్తశుద్ధితో రైతుల హామీలను నెరవేరుస్తూ వారికి 24 గంటల ఉచిత నాణ్యమైన కరెంటును అందించాలని, మల్లన్న సాగర్ కాలువలను , టన్నల్ పనులను పునరుద్ధరణ చేసి రైతులకు సాగునీరు అందించాలని వంటేరు ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి అనంతుల అశ్విని ప్రశాంత్, మాజీ ఎంపీపీ ర్యాగల సుగుణ దుర్గయ్య, మండల ఫోరం అధ్యక్షుడు కాసపురం సంజీవరెడ్డి, దుద్దెడ గ్రామ సర్పంచ్ మిద్దె శివకుమార్, సర్పంచులు గాలి బాలయ్య, ముత్యాల ఎల్లం, తేలు అశోక్, బొమ్మ మల్లయ్య, కోడెల రవి, బాలస్వామి, సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు దోమల ఎల్లం, పెద్దంకుల శ్రీనివాస్, పిల్లి నాగరాజు, గోనె శ్రీనివాస్, రాజిరెడ్డి, జీర్ర రాజు, సురేందర్ రెడ్డి, నరసింహారెడ్డి, గొట్టే ఐలయ్య, చిలుముల రామ్మోహన్, వెంకటేష్, కోడెల మల్లేశం, సున్నం భాస్కర్, దొమ్మాట మహిపాల్ రెడ్డి, బోద్దుల తిరుపతి, సింగాటం రాములు, అమ్ముల రమేష్, సుధాకర్, యాదగిరి,బీరయ్య, కనకయ్య, మైలారం శ్రీను, విష్ణు, రవి, బాల నరసయ్య, రమేష్, దున్న సాయిలు, యాదగిరి, కిష్టయ్య, పుట్ట చంద్రం, బూర్గుల సురేందర్, దొడ్ల సురేష్, ఎర్రబోయిన కనకయ్య, జైపాల్, ప్రసాద్, భాను, బాబు, శ్యామ్, సంతోష్, రాజు యాదవ్, నర్సింలు, తిరుపతి, నరేష్, కర్ణాకర్, చంద్రశేఖర్, కొమ్ము స్వామి, చంద్రం, మల్లేశం, కురాటి రమేష్, సుధాకర్, రాసుల రంజిత్, వినేష్, మహేష్, దుస్స భాస్కర్, సీత రాజు తోపాటు బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులున్నారు.

# ఏండ్ల చరిత్ర కలిగిన కోనేరు.. ఇప్పుడిలా!

## అభిషేకానికి నోచుకోని పవిత్ర జలాలు

## అప్పటి నైపుణ్యంతో డైమండ్ కటింగ్ మెట్లు

## పునరుద్ధరించాలని భక్తుల కోరిక

**మేడ్చల్, ఏప్రిల్ 3(అక్షరకలం):**



ఆధ్యాత్మికతకు నిలయమైన మేడ్చల్ రామలింగేశ్వర స్వామి ఆలయ కోనేరు నేటికి ఆదరణకు నోచుకోక పిచ్చిమొక్కలు, నాచుతో నిండిపోయి దర్శనమిస్తోంది. ఒకప్పుడు స్వామివారి అభిషేకానికి పవిత్ర జలాలను అందించిన ఈ కోనేరు, ప్రస్తుతం చెత్తాచెదారానికి నిలయంగా మారడంపై భక్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థల పురాణం ప్రకారం ఈ కోనేరుకు అత్యంత విశిష్టత ఉందని భక్తులు చెబుతున్నారు. గతంలో ఆలయ అర్చకులు ఈ కోనేరు నుంచి జలాలను తీసుకువెళ్లి స్వామివారి అభిషేకం నిర్వహించేవారు. కానీ సరైన నిర్వహణ లేకపోవడంతో నీరు పూర్తిగా కలుషితమై దర్శనమిస్తోంది. పాకూరు పేరుకుపోవడంతో నీరు కంటికి కనిపించని స్థితికి చేరుకుంది. కోనేరు మెట్లు సైతం శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

### డైమండ్ కటింగ్ మెట్ల అపురూప కట్టడం :

చారిత్రక శైలిలో నిర్మించిన ఈ కోనేరుకు సంబంధించిన మెట్లు రాతి కట్టడం నాటి ఇంజనీరింగ్ నైపుణ్యానికి నిదర్శనం. అయితే, కోనేరు చుట్టూ పిచ్చిమొక్కలు మొలవడం, వ్యర్థాలు పేరుకుపోవడంతో ఈ కట్టడం క్రమంగా తన ఉనికిని కోల్పోతోంది. భక్తులు కోనేరు దరిదాపుల్లోకి వెళ్లడానికే భయపడే పరిస్థితి నెలకొంది.

### పునరుద్ధరించాలని భక్తుల డిమాండ్ :

రామలింగేశ్వర గుట్ట అభివృద్ధి చెందుతున్నప్పటికీ, దాని అనుబంధంగా ఉన్న ఈ కోనేరును విస్మరించడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం దక్షిని సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయం ఎండోమెంట్ పరిధిలో ఉన్నందున ఎండోమెంట్ శాఖ అధికారులు, మంత్రి కొండా సురేఖ ఈ ఆలయాన్ని సందర్శించి కోనేటితోపాటు, ఆలయ అభివృద్ధికి సహకరించాలని భక్తులు కోరారు. వెంటనే కోనేరులోని చెత్తను తొలగించి, నీటిని శుద్ధి చేయాలని మేడ్చల్ పట్టణ ప్రజలు కోరుతున్నారు. శిథిలమవుతున్న మెట్లకు మరమ్మతులు చేపట్టి, భక్తులు దిగడానికి వీలుగా తీర్చిదిద్దాలని కోనేరు చుట్టూ రక్షణ చర్యలు చేపట్టి, పర్యాటక ప్రాంతంగా మార్చాలని భక్తులు, ప్రజలు కోరుతున్నారు.



